Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 268 మేడ్చల్ మల్కాజ్‌గిరి 17 అక్టోబర్ 2023 మంగళవారం పేజీలు : 4

## రైళ్లలోనూ బిజినెస్ క్లాస్!

న్యూఢిల్లీ : అచ్చంగా విమానాల్లో బిజినెస్ క్లాస్ మాదిరిగా.. ఎక్స్‌ప్రెస్ రైళ్లలోనూ ప్రత్యేక సేవలు అందించేందుకు భారతీయ రైల్వే సిద్ధమైంది. ఆ మేరకు కపుర్తలలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీ(ఆర్‌సీఎఫ)లో ఫస్ట్–ఏసీ కోచ్‌లు సిద్ధమవుతున్నాయి. విమానాల్లో మాదిరిగా ప్రయాణికుల సీట్లకు అనుసంధానంగా 'ఇంటీరియర్స్ ఆన్ డిమాండ్' సేవలను దృష్టిలో పెట్టుకుని ఈ కోచ్‌లను తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఫస్ట్ ఏసీ కోచ్‌లలో ఓ వైపు బెర్త్‌లతో కూడిన క్యాబిన్లు, మరోవైపు ప్రయాణికులు నడిచేందుకు వీలుగా స్థలం ఉన్నాయి. భారతీయ రైల్వే ఇప్పుడు నడకదారిని మధ్యలో ఉండేలా డిజైన్ చేస్తూ, ఇరువైపులా బిజినెస్ క్లాస్ మాదిరి సదుపాయాలు.. బెర్త్‌లు ఉండేలా కోచ్‌లను డిజైన్ చేస్తోంది. బెర్త్‌ల వద్ద పనోరమ వ్యూవ్‌లో కిటికీలను ఏర్పాటు చేస్తోంది. లోయర్ బెర్త్‌తోపాటు.. అప్పర్‌బెర్త్ ప్రయాణికులకు కూడా కిటికీలు అందుబాటులో ఉంటాయి.



# ఎన్నికలు రాంగనే ఆగం కావొద్దు

# ఆలోచించి ఓటు వేయండి

## జనగామ సభలో సీఎం కేసీఆర్ పిలుపు

జనగామ : ఎన్నికలు రాంగనే ఆగం కావొద్దు.. ఎవరో చెప్పారని ఓటు వేయొద్దు సీఎం కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. జనగామలో జరిగిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. 'ఎలక్షన్లు చాలా సందర్భాల్లో వస్తాయి. ఎన్నికలు రాంగనే ఆగం కావొద్దు. పరేషన్ కావొద్దు. ఎవరో చెప్పారని ఓటు వేయవద్దు. మా బావమరిది చెప్పిండు. మా మ్యాన మామ చెప్పిండు.. మా అన్నగాడు చెప్పిండని ఓటు వేయొద్దు. ఓటు అనేది మన తలరాతను మారుస్తుంది. మన రాష్ట్ర దశ, దిశను మారుస్తుంది. చాలా ముఖ్యమైన ఆయుధం. ప్రజాస్వామ్యంలో మన చేతిలో ఉండే బలమైన ఆయుధమే ఓటు. దాన్ని ఎటు వినియోగిస్తమో మన ఖర్మ అటే పోతది. ఎవరో చెప్పారని నమ్మితే చాలా ప్రమాదం ఉంటది. కొందరు ఆపద మొక్కులు మొక్కే వారుంటారు. ఐదేళ్లు ఎక్కడ కనిపించరు.. ఎన్నికలు మొపుగాంగనే వస్తరు.. ఇష్టం వచ్చినట్లు మాట్లడుతరు. నోటికి వచ్చినట్లు మాట్లడుతరు. మంచి, చెడు గుర్తించి.. మంచి వైపు వెళితే బ్రహ్మాండమైన ఫలితాలు వచ్చే ఆస్కారం ఉంటుంది' అన్నారు.

**సంతోషకరమైన వార్త చెప్పేది ఏంటంటే..** 'సంతోషకరమైన వార్త నేను చెప్పేది ఏంటంటే.. మీకు దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీళ్లు వస్తున్నాయ్. కాళేశ్వరానికి లింకైన మల్లన్న సాగర్ మీ నెత్తిమీద కుండలాగనే 50 టీఎంసీల ప్రాజెక్టు ఉంటది. టప్పాస్‌పల్లి రిజర్వాయర్‌కు దాన్ని లింక్ చేస్తున్నాం. ఏ పరిస్థితుల్లో కరువు వొచ్చినా జనగామకు కరువు అన్నది రాదు. కొన్ని కొన్ని రిపేర్లు, పంట కాలువలు కావాలని కోరారు. కాలువలన్నీ పూర్తి చేయిస్తాం. ఇప్పటికే ప్రాజెక్టులు పూర్తయ్యాయి. ఇంకా రెండు, మూడు లిఫ్టులు పెడితే జనగామలో అందరికీ నీళ్లు వచ్చే అవకాశం ఉంటుంది. అవన్నీ తెచ్చి మీకు అప్పగిస్తా. దేవాదుల తెలంగాణ గులాబీ జెండా ఎగురగానే చంద్రబాబు శంకుస్థాపన చేశారు. మాయమాటలు చెప్పి మోసపోయే ప్రయత్నం చేశారు. కొంత మధ్యలో కాంగ్రెస్ చేసినా అసంపూర్తిగా ఉండే. నదిలో నీళ్లు పోతయి కాని.. దేవాదుల పంపులకు నీళ్లు అందయ్. దాన్ని గుర్తించి అక్కడ సమ్మక్క బ్యారేజీ కట్టుకున్నాం. ఆ బ్యారేజీలో 365 నీళ్లు నిలబడి ఉంటయ్. ఇది వరంగల్ జిల్లాకే అంకితం చేశాం. మే నెలలోనూ నీళ్లు అందుబాటులో ఉంటాయి. మంచి బంగారు, వజ్రపు తునకలాంటి వరంగల్‌ను చూడబోతున్నాం' చెప్పారు.

**నిజాయితీ ఉంది కాబట్టే విజయవంతం అయ్యాం..** 'రాష్ట్రం వచ్చిన తర్వాత ఎలాంటి పరిస్థితులు ఉండేవో మీకు తెలుసు. కరెంటు లేదు. మంచినీళ్లు, సాగునీరు లేదు. యువకులు వలసవెళ్లి బతుకుతుండే. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెల్వది. అంచనాలు ఎవరికీ లేవు. చీకట్లోకి బాణం కొట్టినటువంటి పరిస్థితి. చాలా మంది ఆర్థిక నిపుణులు, జీఆర్‌రెడ్డిలాంటి వారిని పిలిపించి మేధోమథనం చేసి దారి పట్టుకున్నాం. భగవంతుడి దయ వల్ల నిజాయితీ ఉంది కాబట్టి విజయవంతం అయ్యాం. తొమ్మిదేళ్ల కింద మన పరిస్థితి ఎట్ల ఉండే. ఆ నాడు మనం ఏడ్చినా ఎవరూ పట్టించుకోలేదు. ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోతే లంచాలు పెట్టే పరిస్థితి. మూడు నాలుగు రోజులకు వచ్చే వరకు పొలాలు ఉండుతుండే. ఇప్పుడు 24 గంటల కరెంటు ఉంటుంది. నాణ్యమైన కరెంటు వస్తుంది. ఎక్కడా ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలుతలేవు. ఎన్ని మోటర్లు ఉన్నయ్.. ఐదు హెచ్‌పీ పెట్టినవా అని అడిగే కొడుకే లేడు. ఎందుకంటే తెలంగాణలో వ్యవసాయ స్థిరీకరణ జరగాలే. గ్రామాలు రైతుల పంటలు పండితే.. తింటే దంగుతయా? అని పెద్దలు అన్నరు. ఇప్పుడు పంటలు ఎంట్ల పండుతున్నయో చూస్తున్నరు. రెండు నెలలు కొనుగోలు చేసినా దంగుతలేవు. హెలికాప్టర్‌లో పోతుంటే గ్రామంలో, రోడ్లపై ఎండబోసిన లక్షల టన్నుల ధాన్యం కండ్లారా కనిపిస్తుంది. దాన్ని చూస్తే మనసు పులకిస్తుంది. తెలంగాణలో అమ్మవారి దయ లక్ష్మీదేవి తాండవం ఆడినట్లు పల్లెలన్నీ కళకళలాడుతున్నయ్. జరంతా మొఖం తెలివికి వచ్చినం. రైతులు ఇప్పుడిప్పుడే అప్పులు మాఫీ చేసుకొని.. వడ్లన్నీ ప్రభుత్వం కొనడంతో మొఖం తెలివి అయినం. ఒకమాదిరి అయినం' అన్నారు.

## బీఆర్ఎస్ మెనిఫెస్టోతో కాంగ్రెస్, బీజేపీల్లో గుబులు

హైదరాబాద్: బీఆర్ఎస్ మెనిఫెస్టోతో కాంగ్రెస్, బీజేపీల్లో గుబులు నెలకొందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ. కాంగ్రెస్ గ్యారెంటీలు టిష్యూ పేపర్లు అంటూ వ్యాఖ్యలు చేశారు. అమరజ్యోతి వద్దకు వచ్చి రాహుల్ గాంధీ నివాళులర్పించగల ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. అమరులకు నివాళులర్పిస్తే కాంగ్రెస్ చేసిన పాపాలు కొన్నయినా తొలుగుతాయన్నారు. ఆత్మహత్యలకు




కారణమే కాంగ్రెస్ అని విమర్శించారు. అబద్దాలు చెప్పడంలో ఆరితేరిన బీజేపీ .. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. రాష్ట్ర విభజన హామీలు అమలు ఏది అని అన్నారు. గత పదేళ్లలో తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేదన్నారు. ఒక్క సీటులో కూడా బీజేపీకి డిపాజిట్ రాదని తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టం చేసేలా బీఆర్ఎస్ మెనిఫెస్టో ఉందని కవిత పేర్కొన్నారు.


## కాంగ్రెస్ వార్‌రూమ్ కేసు.. ఆ అధికారులపై చర్యలు తీసుకోండి: హైకోర్టు

హైదరాబాద్: కాంగ్రెస్ వార్ రూమ్ వాలంటీర్ల నిర్బంధంపై తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించింది. వాలంటీర్ల నిర్బంధంపై విచారణకు ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరించారన్న హైకోర్టు.. అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీని ఆదేశించింది.

సీఎం కేసీఆర్, కేటీఆర్, కవిత ఫొటోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారంటూ గత డిసెంబరులో ముగ్గుర్ని పోలీసులు అరెస్టు చేశారు. వారిని అక్రమంగా నిర్బంధించారంటూ కాంగ్రెస్ సీనియర్ నేత మల్లురవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం తాజాగా తీర్పు వెలువరించింది.



## కష్టపడిన వారికి కాంగ్రెస్ అన్యాయం చేసింది




నాగర్ కర్నూల్ జిల్లా: కాంగ్రెస్ పార్టీ టికెట్ల విషయంలో కష్టపడిన వారికి అన్యాయం చేసిందని, దీనికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని మాజీమంత్రి నాగం జనార్దన్ రెడ్డి అన్నారు. సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలం, ముష్టిపల్లిలో చింతలపల్లి జగదీశ్వర్ రావు, అసమ్మతి నేతలు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన నాగం జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. జూపల్లి కృష్ణారావు గెలిస్తే పార్టీ మారరని చెప్పారా అని ప్రశ్నించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ రాకపోతే వచ్చేవాళ్ళు కాదని, జూపల్లి అవకాశవాదని, కోవర్టని విమర్శించారు. టికెట్లు ఇవ్వకుండా అవమానం చేశారని బుద్ధి చెపుతామన్నారు. పార్టీలో అన్యాయం జరిగిన అభ్యర్ధులకు అండగా ఉంటామని, కలిసి పోరాటం చేస్తామని నాగం జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. పొన్నాల లక్ష్మయ్యను, బీసీ కులాన్ని రేవంత్ రెడ్డి అవమానించారన్నారు.

కెఎల్ఐ ప్రాజెక్ట్ మోటార్లు పని చేయకుండా చేసింది జూపల్లి కృష్ణారావు అని అన్నారు. చింతలపల్లి జగదీశ్వర రావు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి మోసం చేశారని, జూపల్లిని ఓడించి బుద్ధి చెపుతామని అన్నారు. ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటానని, తినే అన్నంలో జూపల్లి మట్టి పోశారని జగదీశ్వర రావు మండిపడ్డారు.

## ప్రవళిక పరువు తీసేందుకు కేసీఆర్ పోలీసులను వాడుకుంటున్నారు

హైదరాబాద్: కేసీఆర్ సర్కారుపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శలు గుప్పించారు. "దివంగత ప్రవళిక పరువు తీసేందుకు కేసీఆర్ పోలీసులను వాడుకుంటున్నారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా కేటీఆర్ వాదన ఉంది. ఆత్మహత్యకు వేరే కారణం ఉందంటే నిరుద్యోగులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల నిర్వహణ, లీకేజీలతో 30 లక్షల మందిని మోసం చేశారు. ప్రవలిళికగా గ్రూప్ 4 రాసి గ్రూప్ 1, 2 కోసం ప్రిపేర్ అవుతున్న విషయం కేటీఆర్ దాస్తే దాగేది కాదు. మీ చేతగాని తనం కోసం చనిపోయిన అమాయక అమ్మాయి



మీద నెపం నెట్టడం మరింత దారుణం. కర్కశంగా ఒక కుటుంబాన్ని అబాసు, అప్రతిష్ఠ పాలు చేయడం కరెక్టేనా?. మానవత్వం ఉన్న ఎవరూ కేటీఆర్ లా వ్యవహరించరు, మాట్లాడరు. ఒక్క పోటీ పరీక్ష కూడా సక్రమంగా నిర్వహించని చరిత్ర మీది. 3016 నిరుద్యోగ భృతి ఇస్తా అని మోసం చేసింది మీరు. పేదలు చదివే బడులు మూత పడుతున్నాయి. పిల్లల భవిష్యత్‌పై తల్లితండ్రుల ఆందోళన బాగా పెరిగింది. ఆ కుటుంబంతో పాటు నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తారు. విచారణ కాకముందే, పోస్ట్ మార్టం రిపోర్ట్ రాకముందే డీసీపీ ఎలా తీర్పు ఇస్తారు. చర్యలు తీసుకోవాల్సింది డీసీపీ మీద చర్య, సీఐ మీద కాదు." అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు.

# రంగంలోకి దిగిన హైకమాండ్

## తెలంగాణలో మూడు రోజులపాటు రాహుల్, ప్రియాంక పర్యటన

## గాంధీ వారసుల ఎంట్రీతో క్యాడర్‌లో ఫుల్ జోష్!





హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరగనున్న క్రమంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రంగంలోకి దిగుతున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ మూడు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి వస్తున్నారు. మూడు రోజులపాటు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. అక్టోబర్ 18, 19, 20 తేదీల్లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పర్యటించారు. ఈ విషయాలను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంఛార్జ్ మాణిక్ రావు ఠాక్రే తెలిపారు. ములుగు నుంచి కాంగ్రెస్ బస్సు యాత్ర ఉంటుందని, పెద్దపల్లిలో భారీ బహిరంగ సభ జరగనుందని చెప్పారు. చంద్రబాబు ఆరోగ్యంపై తాజా అప్‌డేట్ ఈ సభలో రాహుల్, ప్రియాంక పాల్గొననున్నారని ఆయన తెలిపారు. అక్టోబర్ 18న జగిత్యాల జిల్లాలోని కొండగట్టులో రాహుల్ గాంధీ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామప్ప ఆలయాన్ని కూడా రాహుల్, ప్రియాంకలు సందర్శించి పూజలు నిర్వహించనున్నట్లు సమాచారం. మరోవైపు, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఆదివారం 55 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. వామపక్షాలతో పొత్తుపై, మిగిలిన స్థానాలపై మరో రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు తొలి జాబితాలో చోటు దక్కకపోవడం గమనార్హం. మరికొంత మంది కాంగ్రెస్ నేతలకు కూడా చోటు దక్కకపోవడంతో వారంతా పార్టీని వీడుతున్నారు. రాష్ట్ర పార్టీ నాయకత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డికి కూడా సీటు దక్కకపోవడంతో ఆయన అసంతృప్తికి గురయ్యారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నేత జానా రెడ్డి, ఆయన బృందం నాగంను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు.

# మార్క్‌ఫెడ్ కొనుగోలుపై ఆశలు

జగిత్యాల : రైతులు వానాకాలంలో పండించిన మక్కలను మార్కెటింగ్ చేస్తుండగా ప్రస్తుతం బయటి మార్కెట్లో ధరలు రోజురోజుకు తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం మక్కల కొనుగోలుకు కర్షకులు ఎదురుచూస్తున్నారు. జగిత్యాల జిల్లాలో వానాకాలం పసుపులో మిశ్రమ పంటగా, ఏకపంటగా మొక్కజొన్నను సాగుచేశారు. ఎకరాకు కనీసం 15-25 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈ నెల మొదటివారం నుంచి రైతులు మక్కలను మార్కెటింగ్ చేస్తున్నారు. గత నెలలో మక్కలకు బయటి మార్కెట్లో క్వింటాలుకు రూ.2,300 పైబడి ధరలు పలకగా ప్రస్తుతం రోజురోజుకు తగ్గుతున్నా యి. జగిత్యాల బీటులో గురువారం క్వింటాలుకు రూ.1,954 ధర పలికింది. ధరలు ఇంకనూ తగ్గే అవకాశం ఉండటంతో మార్క్‌ఫెడ్ కేంద్రాల ఆవశ్యకత వచ్చిపడింది.

రెండేళ్లు మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలను కొనకపోగా రైతులకు మధ్యవర్తులే దిక్కుగా మారారు. తిరిగి నిరుడు యాసంగిలో మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలను కొనుగోలు చేశారు. ఈ నేపథ్యంలో సంస్థకు కూడా



రాష్ట్రవ్యాప్తంగా మక్కల సేకరణతో రూ.7 కోట్లకుపైగా లాభం రావటంతో ఈ సారి కూడా మక్కలను కొనేందుకు ఆసక్తిగా ఉన్నారు. ఎన్నికల ప్రకటన వెలువడినందున ఈసీ అనుమతికి కొనుగోలు అంశాన్ని నివేదించారు. గత యాసంగిలో జిల్లాలో 12 కేంద్రాలను ఏర్పాటుచేసి మక్కలను కొనటంతో చాలా మంది రైతులకు లబ్ధి కలిగింది. మార్క్‌ఫెడ్ రంగంలో ఉంటే బయటి మార్కెట్లోనూ ధరలు నిలకడగా ఉంటాయి. ప్రభుత్వసంస్థ కొంటే డబ్బులకు గ్యారంటీ, తూకంలో మోసాల నివారణ వంటి సానుకూలాంశాలు రైతులకుంటాయి. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌లోనూ కనీసం 15 కేంద్రాల ద్వారా సేకరణ చేపట్టాలని మార్క్‌ఫెడ్ అధికారులు యోచిస్తున్నారు. అయితే రైతులు తక్కువ ధరకు మార్కెట్లో విక్రయించిన తరువాత ఆలస్యంగా కాకుండా ముందస్తుగానే మార్క్‌ఫెడ్ మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.గత యాసంగిలో జిల్లాలో ఏర్పరచిన మార్క్‌ఫెడ్ కేంద్రాల సంఖ్య : 12

రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన మక్కలు : 34,061 క్వింటాళు

ఈ వానాకాలంలో సాగుచేసిన మొక్కజొన్న : 38,746 ఎకరాలు

జిల్లాలో సగటు దిగుబడి అంచనా: 7 లక్షల క్వింటాళ్లు

ప్రభుత్వానికి నివేదించాం మొక్కజొన్న సాగు, మక్కలకు మార్కెట్లో పలుకుతున్న ధరలపై ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేస్తే కేంద్రాలను ఏర్పాటుచేసి మక్కలను కొనుగోలు చేస్తాం. దివ్యభారతి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్

# గ్రామీణ రహదారులు ఛిద్రం.. సమస్యలు తీవ్రం

జగిత్యాల : నియోజకవర్గంలో గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షాలకే చిత్తడిగా మారడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల నుంచి మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లే దారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దశాబ్దాలు గడుస్తున్నా తారు రోడ్లు నిర్మించకపోవడంతో గ్రామీణులు ఇక్కట్లు పడుతున్నారు. ఏళ్ల తరబడి మట్టి రోడ్లపైనే రాకపోకలు చేస్తుండడంతో గుంతలమయంగా మారుతున్నాయి. రోడ్లు నిర్మించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడంతోపాటు కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతుందని గ్రామీణులు వాపోతున్నారు.

బాగు చేయాలని నిరసనలు

చొప్పదండి మండలంలోని ఆర్నకొండ అనుబంధ గ్రామస్థులు గంటలపల్లి రోడ్డు బాగు చేయాలని గంటల తరబడి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కాట్నపల్లి, కోనేరుపల్లి గ్రామాల్లో పలు యువజన సంఘాల ఆధ్వర్యంలో రోడ్లు మరమ్మతు చేయాలని రోడ్లపై వరి నాట్లు వేసి నిరసన గళాన్ని వినిపించారు.పలు మండలాల పరిస్థితి..

ఆర్నకొండ అనుబంధ గ్రామం గంటలపల్లి నుంచి జూలపల్లి మండలం వెళ్లే దారి బురదగా మారి వరిపొలాన్ని తలపిస్తోంది.

భూపాలపట్నం అనుబంధ గ్రామం గొల్లపల్లి నుంచి జూలపల్లి మండలం నాగులపల్లికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది.



చొప్పదండి మండలం కాట్నపల్లి, కోనేరుపల్లి గ్రామాల మీదుగా రామడుగు మండలం కొక్కెరకుంట, కొత్తపల్లికి వెళ్లే రహదారి ఎస్సారెస్పీ కాలువ పక్కనే ఉన్న రహదారి గుంతలమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

గుమ్లాపూర్ నుంచి సాంబయ్యపల్లికి వెళ్లే రహదారి, కాట్నపల్లి నుంచి రుద్రారం రహదారి, రుక్మాపూర్ నుంచి కరీంనగర్ గ్రామీణ మండలం ఫకీర్‌పేట్ వెళ్లే దారి మట్టిరోడ్లు కావడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.గుమ్లాపూర్ నుంచి రామడుగు మండలానికి వెళ్లే ప్రధాన రహదారి 2కి.మీ మేర తారు రోడ్డు కోసం కంకర పోసి చదును చేసి వదిలేశారు.చిట్యాలపల్లి-రెవెల్లి మధ్య రహదారిపై ఏటా వర్షానికి వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

ఆర్నకొండ-మల్యాల రహదారికి నిధులు మంజూరైనా పనుల ప్రారంభంలో జాప్యం జరుగుతోంది.

ఆర్నకొండ-రాగంపేట మధ్య పందివాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వంతెన పాడైంది.

మరమ్మతు చేసేలా చర్యలు..

దెబ్బతిన్న రహదారులను యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. మరికొన్నింటికి ఇతర జిల్లాల నుంచి ప్రతిపాదనలు పంపించారు. త్వరలోనే మంజూరవుతాయి. ఆర్నకొండ-మల్యాల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు చేసేలా గుత్తేదారుతో మాట్లాడతాం.విజయసారథి, ఏఈ పంచాయతీరాజ్ చొప్పదండి

# చేరికల జోరు.. పోటాపోటీ తీరు



కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాజకీయ వేడి పెరుగుతోంది.. మూడు ప్రధాన పార్టీల మధ్య రసవత్తరమైన పోరు కొనసాగుతోంది.. భారాస అన్ని నియోజకవర్గాల్లో పట్టు నిలుపుకొనే విధంగా పావులు కదుపుతుంటే.. ప్రత్యర్థి పార్టీలు వ్యూహాత్మక ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నాయి.. ఎప్పుడు ఏ పార్టీ నాయకుడు ఏ పార్టీ పంచన చేరుతారనే ఉత్కంఠ అన్ని నియోజకవర్గాల్లో కనిపిస్తోంది. ఇప్పటికే కారు పార్టీలో అసంతృప్తి సెగలతో బయటకు వచ్చిన కొందరు ప్రత్యామ్నాయ దారులను వెతుక్కుంటున్నారు. ఇదే కోవలో గత నెలలో పార్టీని వీడిన మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తాజాగా కమలం గూటికి చేరారు. జిల్లాకు చెందిన భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఎన్నికల కమిటీ ఛైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ల నేతృత్వంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో కాషాయ కండువాను కప్పుకొన్నారు. ఆయనతోపాటు ఇదే నియోజకవర్గానికి చెందిన శంకరపట్నం మాజీ ఎంపీపీ రాములు సహా మాజీ సర్పంచులు పలువురు కమల దళంలో చేరారు..

2019 పార్లమెంటు ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ను వీడి అప్పటి తెరాసలో చేరిన ఆరెపల్లి మోహన్ నామినేటెడ్ పదవి వస్తుందని ఆశించారు. ఈ ఎన్నికల్లోనైనా భారాస తనకు అవకాశం కల్పిస్తుందనే ఆశతో టికెట్ కోసం ఎదురుచూశారు. తీరా సిట్టింగ్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మరోసారి భారాస తరఫున రంగంలోకి దిగడం ఖాయమైంది. దీంతో కినుక వహించిన ఆరెపల్లి మోహన్ గత నెలలో పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి విప్‌గా వ్యవహరించిన ఆయనకు అంతకుముందు కరీంనగర్ జడ్పీ ఛైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉంది. 2014, 2018 ఎన్నికల్లో మానకొండూర్ స్థానం నుంచి బరిలో దిగినా ఓటమి పాలయ్యారు. నియోజకవర్గంలో తనకున్న పట్టును నిలబెట్టుకోవాలని ఆయన కొన్నాళ్లుగా పరితపిస్తున్నారు. ఇందులో భాగంగానే తిరిగి కాంగ్రెస్‌లోకి వెళ్లాలని భావిస్తున్నారని ఊహాగానాలు వచ్చినా, అక్కడ టికెట్ దక్కదని గ్రహించి వెనకడుగు వేసినట్లు ప్రచారం జరిగింది. చివరికి భాజపాలో చేరారు. ఈ ఎన్నికల్లో భాజపా తనకు టికెట్ ఇస్తుందనే ధీమాతో ఆయన ఉండగా.. ఆయన పోటీ చేస్తే మానకొండూర్‌లో పోరు రసవత్తరం కానుంది.

మంథనిలో ఊహించని పరిణామం : 2018 ఎన్నికల్లో మంథనిలో భాజపా నుంచి పోటీ చేసిన సనత్‌కుమార్‌ను భారాస అభ్యర్థి, జడ్పీ ఛైర్‌పర్సన్ పుట్ట మధూకర్ దంపతులు బుధవారం కలవడం ఊహించని పరిణామంగా నిలిచింది. భారాసలోకి ఆహ్వానించడానికి ఆయనను కలిసినట్లు మధూకర్ ప్రకటించగా.. ఇప్పటి వరకైతే సనత్‌కుమార్ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇద్దరు నేతల భేటీ మాత్రం చర్చనీయాంశమైంది.

హస్తం గూటికి ఎంపీపీలు..

మానకొండూర్ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు ఎంపీపీలు కాంగ్రెస్‌లో చేరడం అధికార భారాసకు షాక్ ఇచ్చింది. నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో మానకొండూర్, ఇల్లంతకుంట మండలాలకు చెందిన ఎంపీపీలు ముద్దసాని సులోచన శ్రీనివాస్‌రెడ్డి, వూట్కూరి వెంకటరమణారెడ్డిలు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకొన్నారు. వీరితోపాటు పలువురు మాజీ సర్పంచులు, సింగిల్‌విండో డైరెక్టర్లు, ఇతర నాయకులు భారాసను వీడుతున్నట్లు ప్రకటించి హైదరాబాద్‌కు వెళ్లి పార్టీలో చేరడం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైంది. ఒక్కరోజే ఇద్దరు ఎంపీపీలు కాంగ్రెస్ గూటికి చేరడం అధికార పార్టీ నేతలను విస్మయానికి గురి చేసింది. ఈ నియోజకవర్గంలో ఎలాగైనా కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలనే ఉద్దేశంతో డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఇప్పటికే పలు మండలాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నేతలు భారాసను వీడేలా చేయడంలో కృతకృత్యులయ్యారు. భారాస జిల్లా అధ్యక్షుడు, సుడా ఛైర్మన్ జీవీ రామకృష్ణారావు ఇదే నియోజకవర్గానికి చెందిన వారు కాగా, ఊహించని విధంగా నేతలు పార్టీని వీడటం సంకటంలో పడేసింది.

# ప్రబలుతున్న జ్వరాలు



మంథని: మంథని పట్టణానికి చెందిన దొంతుల సాయి చరణ్(24) సోదరుడి నిశ్చితార్థం ఉండటంతో ఈ నెల 8న షాపింగ్ కోసం హైదరాబాద్ వెళ్లాడు. స్వల్ప జ్వరం రావడంతో ఆసుపత్రికి వెళ్లాడు. పరీక్షల్లో డెంగీ నిర్ధారణ అయింది. చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో పెళ్లి జరగాల్సిన ఇంట్లో తీరని విషాదం చోటుచేసుకొంది. లండన్‌లో ఎంబీఏ చదువుకొని అన్నయ్య పెళ్లి కోసం ఇంటికి వచ్చిన సాయిచరణ్‌ను డెంగీ మహమ్మారి కబళించింది.

మంథని మండలం ఎగ్లాస్‌పూర్‌లో దాదాపు ఇంటికొకరు చొప్పున జ్వరాల బారిన పడ్డారు. గ్రామానికి చెందిన లావణ్య పది రోజుల కిందట, వంశీకృష్ణ ఈ నెల 3న డెంగీ బారిన పడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు.

మంథనిలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వర బాధితులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. డెంగీ బారిన పడి ఈ ప్రాంతంలో రోజుల వ్యవధిలోనే ముగ్గురు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల మండలంలోని ఎగ్లాస్‌పూర్‌లో ఇద్దరు, మంథనికి చెందిన యువకుడు మృత్యువాత పడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, పారిశుద్ధ్య లోపంతో జ్వరాలు ప్రబలుతున్నాయి. మంథని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ప్రైవేటులో వందలాది మంది చికిత్స పొందుతున్నారు. సర్కారు దవాఖానాలో డెంగీ వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులో లేకపోవడంతో పరీక్షలు నిర్వహించడం లేదు. రోగులకు రక్త కణాల పరీక్షలు నిర్వహించి తక్కువగా ఉన్న వారికి చికిత్స అందిస్తున్నారు. జ్వరాల తీవ్రత అధికంగా ఉన్న రోగులను కరీంనగర్, హైదరాబాద్ ఆసుపత్రులకు తీసుకెళుతుండగా సకాలంలో వైద్యం అందక డెంగీ బారిన పడి మృత్యువాత పడుతున్నారు.90 శాతం మంది జ్వర బాధితులే

మంథని సామాజిక వైద్యశాలకు ప్రతిరోజూ 250 మంది రోగులు వస్తున్నారు. వీరిలో 90 శాతం మంది జ్వర బాధితులే ఉంటున్నారు. జ్వరాలతో పాటు దగ్గు, జలుబు లక్షణాలతో అవస్థలు పడుతున్నారు. ఆసుపత్రిలో 25 మంది ఇన్‌పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వం డెంగీ పరీక్షల కిట్లు సరఫరా చేయకపోవడంతో కరీంనగర్, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్తూ వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. స్థానిక ఆసుపత్రుల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వం కిట్లు సరఫరా చేయడం లేదు

మంథని మండలం కన్నాల, పోతారం గ్రామాల్లో ఈ నెలలో రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. గత నెలలో నలుగురు డెంగీ బారిన పడ్డారు. ఎగ్లాస్‌పూర్, మంథనిలో డెంగీతో మృతి చెందిన వారు స్థానిక ఆసుపత్రులకు రాలేదు. నేరుగా హైదరాబాద్‌కు వెళ్లి చికిత్స పొందారు. ప్రభుత్వం డెంగీ కిట్లు సరఫరా చేయకపోవడంతో పరీక్షలు చేయడం లేదు.శంకరదేవి, వైద్యురాలు, గద్దలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

# పారిశ్రామిక ప్రాంతం.. వసతులు గగనం

ఎల్లారెడ్డిపేట :పారిశ్రామిక ప్రాంతంలో మెరుగైన సదుపాయాలు లేక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఎన్టీపీసీలోని అంబేడ్కర్ కూడలి నుంచి ఆర్.ఎఫ్.సి.ఎల్. వరకు గల ప్రధాన రహదారిలో వీధి దీపాలు, విభాగినులు(డివైడర్లు) లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రామగుండంలో ఎరువుల కర్మాగారం ఏర్పాటుకు ప్రోత్సాహన్నిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం రహదారి నిర్మాణం కోసం సుమారు రూ.3 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో ఎన్టీపీసీ నుంచి ఆర్.ఎఫ్.సి.ఎల్. వరకు రోడ్డు నిర్మించాల్సి ఉండగా ఫెర్టిలైజర్ సిటీలోని ఆర్.ఎఫ్.సి.ఎల్. ప్రధాన రహదారులతో పాటు ఆర్.ఎఫ్.సి.ఎల్. రైల్వేలైను నుంచి ప్రగతినగర్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. టౌన్‌షిప్‌లో కేంద్రీకృత విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయగా రైల్వే ట్రాక్ గౌతమినగర్ నుంచి ప్రగతినగర్ వరకు కేవలం విభాగినులు నిర్మించి మొక్కలు నాటారు. కేంద్రీకృత విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో అంధకారం నెలకొంది.ప్రధాని వస్తున్నారని...

రెండేళ్లక్రితం రామగుండం ఎరువుల కర్మాగారాన్ని ప్రారంభించేందుకు ప్రధాని వస్తున్నారని సుమారు రూ.2.62 కోట్లతో ప్రగతినగర్ నుంచి ఎన్టీపీసీ టౌన్‌షిప్ రింగు రోడ్డు వరకు రహదారి నిర్మించారు. నగరంలోని ఐదు డివిజన్లలో అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులను ఇందుకోసం కేటాయించారు. తర్వాత ఈ రోడ్డుకోసం కేటాయించిన డబ్బులను ఆర్.ఎఫ్.సి.ఎల్. నుంచి తీసుకుంటామని నగరపాలక అధికారులు పేర్కొన్నప్పటికీ ఇప్పటి వరకూ చెల్లింపులు జరగలేదు. ఈ రోడ్డులో డివైడర్లు, విద్యుత్తు దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వీధిదీపాలు లేకపోవడంతో ప్రగతినగర్‌లోని డివైడర్‌ను ఢీకొని ఒకరు మృతి చెందగా అనేకసార్లు జరిగిన ప్రమాదాల్లో పలువురు



తీవ్రగాయాల పాలయ్యారు. ఎన్టీపీసీ నుంచి ప్రగతినగర్ వరకు డివైడర్లు లేవు. వేగంగా వచ్చే వాహనదారులు ప్రగతినగర్ నుంచి ఉన్న డివైడర్లను గమనించకుండా ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డు ద్వారానే రామగుండం ఎరువుల కర్మాగారం యూరియాను తరలిస్తుంటారు. గతంలోఉన్న విద్యుత్తు దీపాలను రహదారి విస్తరణ పేరిట తొలగించిన అధికారులు మళ్లీ ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో ఎరువుల కర్మాగారం యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ వహించి డివైడర్లు, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. నగరపాలకవర్గం దృష్టి సారించి ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆధార్ కేంద్రం లేక అవస్థలు

ధర్మపురి : ధర్మపురిలో ఉన్న ఆధార్ కేంద్రం నెల రోజులుగా మూత పడటంతో మండల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధార్ కార్డుల సవరణలో జరిగిన తప్పిదాలకు పట్టణంలో ఉన్న కేంద్రానికి నెల రోజులుగా సేవలను నిలిపివేశారు. బీర్‌పూర్, వెల్గటూరులో ఇదే విధంగా జరగడంతో ఈ మండలాలకు చెందిన వారు కూడా ఆధార్ సేవల కోసం ధర్మపురి వచ్చేవారు. ఇక్కడ ఉన్న కేంద్రం కూడా మూత పడటంతో మూడు మండలాలకు చెందిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం రేషన్ ఈ కేవైసీలో భాగంగా చిన్నారుల ఆధార్ పునరుద్ధరణతో పాటు వేలిముద్రలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇది తప్పనిసరిగా ఆధార్ కేంద్రానికి వెళ్లి చేయించుకోవాలి. ఇలా వందల సంఖ్యల కార్డుల్లో వేలి ముద్రలను కొత్తగా నమోదు చేయాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో పాటు కొత్త ఆధార్ కార్డులు, పాత వాటిలో మార్పులు, పీఎం కిసాన్, పాస్‌పోర్టు



కోసం సవరణలు చేసుకోవాల్సి ఉంటోంది. నెల రోజులుగా ధర్మపురిలో ఉన్న కేంద్రం నడవకపోవడంతో వేలాది మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధార్ సవరణ కోసం మారుమూల ప్రాంతాల నుంచి 40 కిలో మీటర్ల మేర జగిత్యాలకు ప్రయాణం చేయాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కాగా ఎలాంటి నోటీసులు లేకుండా ఆధార్ కేంద్రాల ఐడీలను నిలిపివేస్తున్నారనికేంద్రాల నిర్వాహకులు వాపోతున్నారు.

# అదనపు వసూళ్లు.. వినియోగదారుల జేబులకు చిల్లు

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో ఇటీవల ఓ ఇంటి వద్ద వినియోగదారుడికి సిలిండర్ అప్పగించి బిల్లును చేతికందించారు. బాయ్స్ రసీదులో నమోదైన రుసుం కంటే రూ. 60 అదనంగా తీసుకున్నారు. ఇతను ఒక్కడి వద్దే కాదు. వినియోగదారులందరి వద్ద దూరాన్ని బట్టి ఇలా ఎక్కువగా వసూలు చేస్తున్నారు. జిల్లాలో వంట గ్యాస్ ఏజెన్సీల బాయ్స్ అదనపు వసూళ్లకు తెగబడుతుండటంతో వినియోగదారుల జేబులకు చిల్లు పడుతోంది. వాయుబండకు రూ. 30 నుంచి రూ. 60 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. గ్యాస్ సిలిండర్ ధరను ఇటీవల కేంద్ర ప్రభుత్వం తగ్గించడంతో వినియోగదారులు కొంతమేర ఊరట పొందగా అదనపు వసూళ్లు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో వంట గ్యాస్ వినియోగదారులపై అదనపు భారం పడుతుండగా ఏజెన్సీల బాయ్స్‌కు రూ.లక్షల్లో గిట్టుబాటవుతుందనే విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో రెండు పురపాలక సంఘాలు, 12 మండలాల్లో మొత్తం 1,49,245 మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. వీరిలో సింగిల్ కనెక్షన్లు 55,860 ఉండగా, డబుల్ కనెక్షన్లు 34,474 ఉన్నాయి. దీపం పథకం కింద 25,033, కార్పొరేట్ సామాజిక బాధ్యత పథకం పరిధిలో 14,452, ఉజ్వల పథకం కింద 19,426 కనెక్షన్లు ఉన్నాయి. వినియోగదారుల్లో అత్యధిక శాతం మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 12 ఏజెన్సీల ద్వారా గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నాయి. సిలిండర్లను సరఫరా



చేసే వాహనాలు, డెలివరీ బాయ్స్ నిర్వహణ బాధ్యత ఏజెన్సీలదే. గ్యాస్ సిలిండర్ల పంపిణీలో కొన్ని ఏజెన్సీల బాయ్స్ తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డెలివరీ బాయ్స్ ఒక్కో సిలిండర్ వెంట రూ. 30 నుంచి రూ. 60 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో ఓ ఏజెన్సీకి చెందిన సిలిండర్ ధర రూ. 973.50 ఉండగా డెలివరీ బాయ్స్ రూ. వెయ్యి నుంచి రూ. 1030 వరకు తీసుకుంటున్నారు. రవాణా ఛార్జీల పేరిట కొనసాగుతున్న ఈ అదనపు వసూళ్ల మొత్తం ప్రతి నెలా రూ.లక్షల్లో ఉంటుంది. నిబంధనల ప్రకారం రసీదులో ఉన్న మొత్తాన్ని మాత్రమే గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల వద్ద తీసుకోవాలి. రవాణా ఛార్జీల పేరిట ఎలాంటి అదనపు వసూళ్లకు పాల్పడకూడదనే నిబంధనలను జిల్లాలోని పలు ఏజెన్సీల బాయ్స్ విస్మరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అదనపు వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

బిల్లు ప్రకారమే చెల్లించాలి

వినియోగదారులు వారికి వచ్చే బిల్లు ప్రకారమే గ్యాస్ సిలిండర్‌కు డబ్బులు చెల్లించాలి. గ్యాస్ ఏజెన్సీల బాయ్స్ వినియోగదారుల వద్ద బలవంతంగా అదనంగా డబ్బులు వసూలు చేయవద్దనే నిబంధనలు ఉన్నాయి. నిబంధనలను అతిక్రమించే గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు ఉంటాయి. అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందిస్తాం. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి

# రైతులకు మేలు.. సభ్యులకు లాభాలు..!

కొత్తగూడెం : అన్నదాతల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కర్షకులను ప్రమోటర్లు, డైరెక్టర్లు, వాటాదారులుగా చేర్చి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పశువుల దాణా, ఇతర సామగ్రి విక్రయ కేంద్రాల ఏర్పాటుకు సహకరించనుంది. దళారీ వ్యవస్థ లేకుండా రైతులకు నేరుగా ఉత్పత్తులను అందించటం ఈ పథకం లక్ష్యం. ఈ కేంద్రాల్లో రైతులు సభ్యత్వం కలిగి ఉంటారు. ఒక్కో సంస్థలో కనీసం 750 మంది అన్నదాతల భాగస్వామ్యం తప్పనిసరి.

బోర్డు నిర్ణయాల ప్రకారం..

నిర్వహణ, నియంత్రణ కోసం ఒక మేనేజర్/ సీఈఓను నియమించుకుని బోర్డులో తీసుకునే నిర్ణయాలు అమలుచేస్తారు. వివిధ రకాల ఉత్పత్తులను సంస్థల నుంచి నేరుగా సేకరించి రైతులకు అందిస్తారు. తద్వారా రైతులకు పెట్టుబడి తగ్గడమే కాకుండా ఈ వ్యాపారంలో



వచ్చిన లాభాల్లో సభ్యులైన కర్షకులు వాటాలు పొందుతారు. అలాగే పంటలను నేరుగా మిల్లర్లకు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా విక్రయించడంతో మంచి ధరలు వచ్చే అవకాశముంది. వ్యాపారంతో సంస్థకు ఆదాయం వస్తుంది. ప్రాసెసింగ్, ప్యాకింగ్ చేయడం ద్వారా అదనపు రాబడిని సముపార్జించవచ్చు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా చేసే ఈ కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉంటుంది. కేంద్ర వ్యవసాయ శాఖ ద్వారా ఈ పథకం పర్యవేక్షణ జరుగుతుంది.

ప్రోత్సాహకాలు ఇలా..కేంద్ర వ్యవసాయ, సహకార శాఖల నుంచి రైతు ఉత్పత్తిదారుల సంస్థకు వ్యాపార నిర్వహణ రుణం అందిస్తున్నారు. షేర్ క్యాపిటల్‌గా ప్రతి రైతు నుంచి రూ.2వేలు సేకరించి సభ్యత్వం ఇస్తారు. రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు క్రెడిట్ కార్డు సౌకర్యం, బీమా కల్పిస్తారు. కౌలు రైతులకూ ఈ సౌకర్యముంటుంది. ఈ సంస్థను సక్రమంగా నిర్వహించేందుకు ప్రోత్సాహకంగా ఏడాదికి రూ.6 లక్షల చొప్పున మూడేళ్లపాటు అందిస్తారు.

తొలి విక్రయ కేంద్రమిదే..

కేంద్రం చేపట్టిన ఈ పథకంలో భాగంగా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో తొలిసారిగా రఘునాథపాలెం మండలం చిమ్మపూడిలో శ్రీబాలాజీ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. పక్షం రోజుల క్రితం ఏర్పాటైన ఈ సంస్థలో ఇప్పటికే 250 మంది సభ్యులుగా చేరారు. ఈ సంస్థ ద్వారా రైతులకు తక్కువ ధరకే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందిస్తున్నారు. ఉభయ జిల్లాల్లో పలుచోట్ల రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలున్నాయి.

రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా అన్నదాతలకు ఎంతో మేలు కలుగుతుంది. రైతుల భాగస్వామ్యంతో దీన్ని నిర్వహిస్తున్నాం. చిమ్మపూడితోపాటు పరిసర గ్రామాలకు చెందిన సుమారు 1,000 మందిని సభ్యులుగా చేర్చాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం. గుత్తా వెంకటేశ్వర్లు, ఛైర్మన్, శ్రీబాలాజీ రైతు ఉత్పత్తిదారు సంస్థ

# తుపాకులు పేలుతున్నాయి..!

మహబూబాబాద్ : ఉమ్మడి జిల్లాలో తుపాకీ కాల్పుల ఘటనలు కలవరపెడుతున్నాయి. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో లైసెన్స్ తుపాకులను పోలీస్ శాఖ వద్ద డిపాజిట్ చేయాలి. ఈ ప్రక్రియ సజావుగా సాగడం లేదు. వీటిని పొందుతున్న వారిలో రియల్టర్లే ఎక్కువగా ఉన్నారు. కొందరు రౌడీ షీటర్ల వద్ద కూడా ఉన్నట్లు సమాచారం. హనుమకొండ జిల్లా గుండ్ల సింగారంలో కానిస్టేబుల్ ప్రసాద్.. ఎస్సై రివాల్వర్‌ను దొంగిలించి అత్తను కాల్చి చంపాడు. పచ్చని పంట పొలాలతో ప్రశాంతంగా ఉండే గ్రామం ఈ ఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. తుపాకీ హత్య మునుపెన్నడూ లేకపోవడంతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నప్పుడు పోలీస్‌శాఖ తుపాకుల వినియోగంపై దృష్టి పెట్టాలి. ఆ కానిస్టేబుల్ వినియోగించిన 9 ఎంఎం తుపాకీ.. పోలీసు శాఖ ఆయనకు కేటాయించింది కాదు. అది తాను విధులు నిర్వహిస్తున్న స్టేషన్ ఎస్సైది. పోలీసులు ఎంత అజాగ్రత్తగా వ్యవహరిస్తున్నారనేది దీన్ని బట్టి తెలుస్తోంది.

గత నెల 15న హనుమకొండ జిల్లా పరకాలలోని ఓ బిల్డర్.. కొంత మంది మధ్య రాజకీయ పరమైన అంశాల్లో వాదనలు పెరగడంతో తన లైసెన్స్ తుపాకితో గాల్లోకి రెండు రౌండ్ల కాల్పులు జరిపాడు. అక్కడున్న వారికి ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు తెలిపిన లెక్కల ప్రకారం ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 221 లైసెన్స్ తుపాకులు ఉన్నాయి.

వరంగల్ పోలీసు కమిషనరేట్ (హనుమకొండ, వరంగల్, జనగామ): 185 , మహబూబాబాద్: 28, ములుగు: 1, భూపాలపల్లి 7 వీటిలో దాదాపు 50 వరకు బ్యాంకులకు సంబంధించినవి ఉంటాయి. వీటికి మినహాయింపు ఉంటుంది. మిగతా 171 తపాకులు వ్యక్తుల వద్ద ఉండగా వాటిలో ఇప్పటి వరకు 74 మంది పోలీసులకు అప్పగించారు. ఇంకా 98 మంది వారి వద్దనే ఉంచుకున్నారు.

చర్యలు తీసుకుంటాం..- సత్యనారాయణ, డీఎస్పీ, మహబూబాబాద్

ఎన్నికల కోడ్ నేపథ్యంలో లైసెన్స్ తుపాకులను సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని చెప్పాం. ఒక్కొక్కరుగా అప్పగిస్తున్నారు. హైదరాబాద్‌లో ఉన్న వారికి కూడా సమాచారం చేరవేశాం. నిబంధనల ప్రకారం ఇవ్వకుంటే చర్యలుంటాయి.

# మణుగూరు ఓసీ విస్తరణకు సమాయత్తం



మణుగూరు : మణుగూరు ఉపరితల (ఓపెన్ కాస్ట్) గని విస్తరణ ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. గని జీవితకాలం మరో మూడేళ్లే ఉండటంతో, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా విస్తరించాల్సి వస్తోంది. గని విస్తరణకు ఎంత భూమి కావాలో సింగరేణి అంచనా వేసి సిద్ధం చేసింది. కావాల్సిన భూమిని సేకరించేందుకు అటవీ, రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు పంపనుంది. కొద్దిరోజుల కిందట భూసేకరణపై సింగరేణి అధికారులు అటవీ అధికారులతో చర్చించారు. 2016లో ఏర్పడిన మణుగూరు ఓసీ గని జీవిత కాలం పదేళ్లు. ప్రస్తుతం ఏడాదికి 21 లక్షల టన్నుల బొగ్గుని వెలికి తీస్తున్నారు.

2026 నాటికి ఉత్పత్తే లక్ష్యంగా..ఓసీ గని విస్తరణకు సింగరేణి సంస్థ సుమారు రూ.120 కోట్ల పైనే వెచ్చించనుంది. ఎక్కువ శాతం భూ పరిహారం రూపంలో రెవెన్యూ శాఖకు చెల్లించనుంది. గని విస్తరణకు 439.28 హెక్టార్లను తీసుకోనుంది. అందులో అటవీ భూమి 74.55, ప్రభుత్వ, లేదా అసైన్డ్ భూమి 327.60, పట్టా భూమి 37.67 హెక్టార్ల మేరకు ఉండనుంది. అటవీ శాఖ నుంచి తీసుకునే భూమికి సింగరేణి సంస్థ మరోచోట ఆశాఖకు భూమి కేటాయించాలి. గని జీవితకాలం పూర్తయ్యేలోపే భూసేకరణ ప్రక్రియను ముగించాలన్న నిశ్చయంతో సింగరేణి ఉంది. 2026 నాటికి విస్తరణ పనులు పూర్తి చేసి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించింది.

ఇళ్లు కోల్పోకుండా భూ సేకరణ

సింగరేణి సంస్థ మణుగూరు ఓసీ గని విస్తరణలో ఇళ్లు కోల్పోకుండా భూ సేకరణ చేపట్టనుంది. ఇళ్లు కోల్పోతే ఎక్కువ మొత్తంలో పరిహారాన్ని సింగరేణి చెల్లించాల్సి ఉంటుంది. మొదటిసారిగా మణుగూరు ఓసీ గని ఏర్పాటుకు సింగరేణి అటవీ, వ్యవసాయ భూములతో పాటు, ఇళ్లను తీసుకొంది. పద్మగూడెం, మల్లేపల్లి, ఎగ్గడిగూడెం వంటి గ్రామాలు కనుమరుగయ్యాయి. ఈ సారి ఆపరిస్థితి లేకుండా ముందుచూపుతో తిర్లాపురం, రామానుజవరం గ్రామాల్లోని అటవీ భూమితో పాటు సాగు భూముల్ని సేకరించనుంది.

అవకతవకలకు చోటివ్వకుండా..

కొన్నేళ్ల కిందట మణుగూరు ఓసీ గని ఏర్పాటు సమయంలో నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో అనేక అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. భూమి లేని వారికీ పరిహారం చెల్లించారని, అసలైన వారికి చెల్లించలేదని చర్చ నడిచింది. ఆరోపణల నేపథ్యంలో సీఐడీ విచారణ కొనసాగింది. మళ్లీ రెండో దఫా గని అవసరాలకు భూసేకరణ చేపట్టనున్న నేపథ్యంలో రెవెన్యూ, సింగరేణి అధికారులు పారదర్శకంగా వ్యవహరించి నిర్వాసితులకు పరిహారం చెల్లించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గని మొత్తం విస్తీర్ణం: 1116.55 హెక్టార్లు
ప్రస్తుత విస్తీర్ణం: 672 హెక్టార్లు
ప్రతిపాదిత నూతన సేకరణ విస్తీర్ణం: 439.28 హెక్టార్లు

# నిబంధనలు ఇవి.. పాటించాల్సిందే మరి




కొత్తగూడెం : రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చింది. ప్రచారం మొదలు ఓట్ల లెక్కింపు వరకు ఇది అమల్లో ఉంటుంది. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేల వెంట పరిగెత్తి వ్యవహారాలను చక్కబెట్టిన అధికారులే.. ఇకపై వారి కదలికలు, ప్రచార శైలిని ఓ కంట కనిపెట్టనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పథకాల పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగించిన అధికారులు నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలకు ఉపక్రమించనున్నారు. ఎన్నికల కోడ్ అమలు సమయంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలు, అధికారుల ఏర్పాట్లు తదితర అంశాలపై 'ఈనాడు' కథనం.

సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారానికి చెక్

ఎన్నికల సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారంపై మీడియా మానిటరింగ్ కమిటీ దృష్టిసారిస్తుంది. కలెక్టర్, పోలీసు అధికారులు, సీనియర్ రిపోర్టర్, పౌరసంబంధాల అధికారి, సీనియర్ సిటిజన్ సభ్యులతో మీడియా మానిటరింగ్ కమిటీని ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. రాజకీయ పార్టీలు, నాయకులు, అభ్యర్థులు, సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న ప్రచార కార్యక్రమాలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. అవాంఛనీయ అంశాలను ప్రచారం చేసిన సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటుంది.

సామాన్యులకు ఇబ్బందిగా నగదు తరలింపు..!

ఎన్నికల సందర్భంగా భారీగా నగదు చేతులు మారుతుందనే అనుమానంతో పోలీసులు చేసే తనిఖీల వల్ల సామాన్యులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అత్యవసరాల నిమిత్తం తీసుకెళ్లే నగదు, బంగారు ఆభరణాలకు సరైన ఆధారాలు లేవంటూ పోలీసులు స్వాధీనపరచుకుంటున్నారని సామాన్యులు వాపోతున్నారు. కోడ్ అమలులో ఉన్నంత కాలం వీలైనంత మేర ఆన్‌లైన్ లావాదేవీలు జరిపితే మంచిదని పోలీసులు సూచిస్తున్నారు. ఒకవేళ అత్యవసరంగా నగదు తీసుకెళ్లాల్సి వచ్చినా ఆధారాలు చూపాల్సి ఉంటుందని చెబుతున్నారు.

అనుమతులు తప్పనిసరి..

రాజకీయ పార్టీలు ప్రచార ప్రకటనలు, లౌడ్ స్పీకర్లను వినియోగించేందుకు ప్రత్యేకంగా అధికారుల అనుమతి తీసుకోవాలి.

అభ్యర్థి ప్రచారానికి మూడు వాహనాలను మాత్రమే వినియోగించాలి. వీటికి సైతం ఎన్నికల అధికారి అనుమతి తప్పనిసరి.

ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి రాత్రి, పగలు తేడా లేకుండా ఎప్పుడైనా ఫిర్యాదు చేయవచ్చు.

ప్రైవేటు స్థలాల్లో ప్రచారానికి ఇంటి, స్థల యజమాని అనుమతి తప్పనిసరి.

ప్రచార ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారులకు అందజేయాలి.

ర్యాలీలు, ప్రచారం, సభలు, సమావేశాలను నిర్దేశిత సమయంలోగా ముగించాలి.

ప్రధానంగా ఎనిమిది అంశాలపై దృష్టి..

ఎన్నికల క్రతువులో పార్టీలు, నేతలు, అభ్యర్థుల ప్రసంగాలు, సభలు-సమావేశాలు, ఊరేగింపులు-ర్యాలీలు, పోలింగ్ రోజు ఆంక్షలు, పోలింగ్ కేంద్రాల్లో ఆంక్షలు, పర్యవేక్షకుల నియామకం, అధికార పార్టీకి నిబంధనలు, ఎన్నికల మ్యానిఫెస్టోలు కీలక పాత్ర పోషిస్తుంటాయి. వీటితో పాటు మరో ఎనిమిది అంశాలపై ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు సమయంలో ప్రత్యేక నిఘా ఉంటుంది.

కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలు ప్రచారంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించకూడదు.

అధికార పార్టీలు కొత్త పథకాలు, ప్రాజెక్టులు, విధానాలను ప్రకటించకూడదు.

ప్రభుత్వ ఖర్చులతో పత్రికలు, మీడియా, ఇతర మాధ్యమాల్లో ప్రకటనలపై నిషేధం ఉంటుంది.

మంత్రులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు అధికారిక కార్యక్రమాల పేరిట ప్రచారం చేయకూడదు. ప్రభుత్వ వాహనాలువినియోగించరాదు.

బహిరంగ సభల నిర్వహణకు మైదానాలు, హెలిప్యాడ్‌ల వినియోగంలో అధికార పార్టీతో పాటు అన్నీ పార్టీలకు ఒకే నిబంధన వర్తిస్తుంది.

ప్రభుత్వాలు ఎలాంటి తాత్కాలిక నియామకాలు చేపట్టకూడదు.

ఎన్నికల ప్రచారానికి వేదికలుగా దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ఇతర ప్రార్థన మందిరాలను ఉపయోగించకూడదు.

ఎన్నికలకు 48 గంటల ముందు ఎలాంటి ప్రచారం చేయకూడదు.

యువతే నిర్ణేత

శాసనసభ ఎన్నికల్లో యువ ఓటర్ల పాత్ర కీలకం కానుంది. కొత్తగా నమోదైన ఓటర్లలో రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా అగ్రభాగాన నిలిచింది. భద్రాద్రి,

ఖమ్మం జిల్లాల్లోని పది నియోజకవర్గాల్లోనూ అభ్యర్థుల గెలుపోటములను యువ ఓటర్లు శాసించనున్నారు. అన్ని స్థానాల్లో 18-29 ఏళ్ల ఓటర్ల సంఖ్య గతం కన్నా గణనీయంగా పెరిగింది.

ఉభయ జిల్లాల్లో.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 21,41,387 మంది ఓటర్లలో 18-29 ఏళ్ల యువతీయువకులు 4,77,515 (22.30 శాతం) మంది ఉన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో యువ ఓటర్లు అత్యధికంగా (74,261 మంది), భద్రాచలం నియోజకవర్గంలో అత్యల్పంగా (27,216 మంది) నమోదయ్యారు. పది నియోజకవర్గాల్లోనూ యువ ఓటర్లు భారీగా ఉండటంతో ప్రధాన పార్టీలు వారిని ఆకట్టుకునేందుకు యత్నిస్తున్నాయి.

# ఇక మారుమూల పల్లెల్లో హాలో హాలో

మహబూబాబాద్ : రాష్ట్రంలోనే అత్యధిక అటవీ ప్రాంతంతో పాటు జనసాంద్రత తక్కువగా ఉన్న ములుగు జిల్లాలో మారుమూల ప్రాంతాలు చాలా ఉన్నాయి. వీటికి సరైన సమాచార వ్యవస్థ లేకపోవడంతో అత్యవసర సమయాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గిరిజన గ్రామాలకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో చరవాణి సంకేతాలు అందడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం మారుమూల ప్రాంతాలకు 4జీ సిగ్నల్ ద్వారా ఇంటర్‌నెట్‌ను అందించాలని సంకల్పించింది. ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌తో పాటు ప్రైవేటు సంస్థలకు కూడా టవర్ల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారు.

జిల్లాలో 23 గ్రామాలకు...

జిల్లాలోని మారుమూలలో ఉన్న పూర్తిగా సిగ్నళ్లు లేని గ్రామాల్లో 23 చోట్ల కొత్తగా టవర్లు ఏర్పాటు చేసి బీఎస్ఎన్ఎల్ ద్వారా 4జీ సేవలను అందించడానికి చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయి.

పురోగతిలో పనులు...

ఈ పనులకు సంబంధించిన ఉత్తర్వులు గత వేసవికాలంలోనే ఇచ్చారు. గుత్తేదారుల కేటాయింపు, వర్షాల కారణంగా చాలా చోట్ల పనులు ఇప్పుడిప్పుడు మొదలవుతున్నాయి. అంటే ఈ ఏడాది చివర వరకు అన్ని మారుమూల ప్రాంతాల్లో టవర్లు ఏర్పాటు చేసి సేవలను ప్రారంభించే అవకాశం ఉంది. ఏటూరునాగారం మండలంలోని చల్పాకలో టవర్ కేటాయింపునకు స్థలం రెవెన్యూ శాఖ కేటాయించినా ఇంకా బీఎస్ఎన్ఎల్ గుత్తేదారుకు అప్పగించ లేదు.

తప్పనున్న ఇబ్బందులు...

ఏజెన్సీ ఏరియాలో సిగ్నల్ లేకపోవడంతో చాలా గిరిజన గ్రామాల్లో ప్రభుత్వ సేవలు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నారు. పింఛన్లు ఇతర సేవలకు సంబంధించి వేలిముద్రల నమోదుకు, రేషన్‌బియ్యం తీసుకోవడానికి, సమాచారం అందించడానికి అవస్థలు పడేవారు. వర్షాకాలంలో గ్రామాలతో సంబంధాలు నిలిచిపోయినప్పుడు సమాచారవ్యవస్థ లేకపోవడంతో ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు చోటుచేసుకున్నాయి. కన్నాయిగూడెం మండలంలోని ఐలాపూర్‌లాంటి గ్రామాలు వర్షాకాలంలో పూర్తిస్థాయిలో జలదిగ్బంధంలో చిక్కుకుని విలవిలలాడుతుంటాయి. ఇలాంటి గ్రామాలకు పూర్తిస్థాయిలో చరవాణి సేవలు ఉంటే కనీసం ఆన్‌లైన్ ద్వారా తాము ఎదుర్కొంటున్న సమస్యలను బయటి ప్రపంచానికి తెలియజేసే అవకాశం ఉంటుంది.

గ్రామాల వివరాలు..కన్నాయిగూడెం: కంతనపల్లి, చింతగూడెం, ఐలాపూర్, చిట్యాల, భూపతిపురం
ఏటూరునాగారం: మల్యాల, చల్పాక
మంగపేట: నిమ్మగూడెం, కొత్తూరు మొట్లగూడెం
తాడ్వాయి: రంగాపూర్, అంకంపల్లి, లింగాల, బంధాల, ఒడ్డుగూడెం, బంజారా ఎల్లాపూర్
వెంకటాపూర్: బండ్లపహాడ్

వీటితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని వాజేడు, వెంకటాపురం మండలాల్లో 3 చొప్పున ఆరు ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటు పనులకు అనుమతులు వచ్చాయి.

త్వరగా సేవలు అందించాలి- కాక వెంకటేశ్వర్లు, సర్పంచి, కొండాయి, ఏటూరునాగారం మండలం.

మా పంచాయతీ పరిధిలో మల్యాలలో సెల్‌టవర్ ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. గత వర్షాకాలంలో చరవాణి సంకేతాలు అందకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. వారధి తెగిపోయిన సందర్భంలో అధికారులకు సమాచారం ఇద్దామంటే కుదరలేదు. సకాలంలో పనులు పూర్తి చేసి సేవలు అందించాలి.

పూర్తి చేసేలా చూస్తాం- రాధాకిషన్, జేఈ, బీఎస్ఎన్ఎల్.

ప్రతి గ్రామానికి ఇంటర్‌నెట్ అందేలా టవర్‌లను ఏర్పాటు చేస్తున్నాం. మొన్నటి భారీవర్షాలకు పనులు నిలిచిపోయాయి. పనులు రెండు మూడు నెలల్లో పూర్తయి సేవలను అందించే అవకాశం ఉంది.

# ఓటు.. ప్రజాస్వామ్య బుల్లెట్టు!

వరంగల్ : ప్రస్తుతం ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య జరుగుతున్న యుద్ధం ఆందోళన కలిగిస్తోంది. ఎప్పుడు ఏ ఆయుధం దూసుకొస్తుందో తెలియని పరిస్థితి.. మిలిటెంట్ల చేతుల్లో బందీలై తుపాకుల తూటాలకు బలవుతున్నవారు ఎందరో.. మరోవైపు రష్యా, ఉక్రెయిన్ యుద్ధ సమయంలోనూ వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిస్థితుల్లో భారత్ వైపు ప్రపంచం చూస్తోంది. దీనికి కారణం ఇక్కడి ప్రజాస్వామ్య విలువలే. ఓటు అనే వజ్రాయుధమే శక్తిమంతమైనదని పలుసార్లు దేశ పౌరులు నిరూపించారు. రాబోయే ఎన్నికల్లోనూ ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి..

ప్రజాస్వామ్యమే ఆయుధం..

ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో ఉగ్రమూకలు చెలరేగిపోతూ అమాయక ప్రజల ప్రాణాలు బలితీసుకుంటున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ మీద నమ్మకం లేక నియంతృత్వ విధానాలవైపు అడుగులు వేస్తున్నాయి. ఈ తరహా పెడ ధోరణులను అణచివేయాలంటే మన ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. బుల్లెట్టు కన్నా శక్తిమంతమైంది బ్యాలెట్టేనని, ఓటుతోనే మనం తీర్పు చెప్పొచ్చని మరోసారి చాటి చెప్పాలి.

వరుసలో నిలబడి ఓటేస్తే వచ్చేదేంటి? నా ఒక్క ఓటుతోనే ఫలితం ఏం తారుమారు కాదుగా.. ఓటేసేందుకు ఆసక్తి చూపని వారి నుంచి ఇలాంటి మాటలు వింటుంటాం. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఇప్పటికీ ఎంతో మంది నిర్లక్ష్యం చూపిస్తుంటారు. ఈసారి ఎన్నికల్లో అయినా ప్రభుత్వం ఏర్పాటులో 'నా ఓటు సైతం' అని భావిస్తే పౌరులుగా మన కర్తవ్యం నెరవేర్చినట్టవుతుంది.

నగరాల్లో మరింత పెరగాలి

ఉమ్మడి వరంగల్‌లో ఓటింగ్ సరళిని చూస్తే పల్లెలకన్నా పట్టణ ప్రాంతాల్లో తక్కువగా ఉంటోంది. 2018లో వరంగల్ పశ్చిమలో కేవలం 58.29 శాతం ఓటింగ్ మాత్రమే నమోదయ్యింది. అన్ని నియోజకవర్గాలతో పోలిస్తే నగర ప్రాంతాల్లో ఓటర్లు ఓటు వేసేందుకు ఆసక్తి చూపించడం లేదు. వరంగల్ తూర్పులో 73.47 శాతం నమోదైంది. పల్లె ప్రాంతాలు ఎక్కువగా ఉన్న నర్సంపేటలో ఏకంగా 90.38 శాతం మంది ఓట్లేశారు.

మాజీ మావోలు బ్యాలెట్టు వైపు..

ఉమ్మడి వరంగల్‌లో ఒకప్పుడు మావోయిస్టుల ప్రాబల్యం చాలా ఎక్కువగా ఉండేది. బ్యాలెట్టును నిషేధిస్తూ వారంతా బుల్లెట్టుతోనే మనం అనుకున్నది సాధించాలనే లక్ష్యంతో ఉండేవారు. చాలా మంది మళ్లీ ప్రజాస్వామ్య వ్యవస్థ ద్వారానే ప్రశ్నించాలని, ప్రజాప్రతినిధులుగా నెగ్గి సరైన పాలనతోనే ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించాలని దృఢంగా నమ్ముతూ బ్యాలెట్టు వైపు అడుగులు వేస్తున్నారు.

గతంలో జనశక్తిలో పనిచేసిన సీతక్క అలియాస్ ధనసరి అనసూయ అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చి ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొంటున్నారు. గతంలో తెదేపాలో పనిచేసి తర్వాత కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. గత ఎన్నికల్లో ములుగు ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజా సమస్యలపై తనదైన గళం వినిపిస్తున్నారు.

ములుగు జిల్లా జడ్పీ తాత్కాలిక ఛైర్‌పర్సన్ బడే నాగజ్యోతి భారాస తరఫున బరిలో నిలవనున్నారు. ఆమె తండ్రి బడే నాగేశ్వరరావు, ఆయన సోదరుడు బడే మురళి దళంలో పనిచేసి పోలీసుల ఎన్‌కౌంటర్‌కు బలయ్యారు.

పరకాల బరిలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న గాజర్ల అశోక్ అలియాస్ ఐతు మావోయిస్టుల్లో దండకారణ్యంలో రాష్ట్ర కమిటీ మెంబర్‌గా పనిచేసి తర్వాత లొంగిపోయారు. వీళ్ల పెద్దన్న గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్ సైతం ఎన్‌కౌంటర్‌లో కన్నుమూశారు.

హనుమకొండ జిల్లా టేకులగూడేనికి చెందిన మాచర్ల ఏసోబు అజ్ఞాతంలో ఉన్నారు. ఆయన కొడుకు మాచర్ల మహేశ్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడానికి తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. వర్ధన్నపేట కాంగ్రెస్ టికెట్టు ఆశిస్తున్నారు. ఇలా వీరంతా బుల్లెట్టు కన్నా బ్యాలెట్టుకు ఎక్కువ శక్తి ఉందని నమ్మి వస్తున్నారు.

# కాగిత రహిత దస్త్రాలతో భద్రత: కలెక్టర్

ఖమ్మం : కురవి నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణంలో సాగు భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.కోటి నష్ట పరిహారం ఇప్పించాలని కోరుతూ కలెక్టర్ గౌతమ్‌కు బాధిత రైతులు, వామపక్ష రైతుసంఘాల ప్రతినిధులు నున్నా నాగేశ్వరరావు, దొండపాటి రమేశ్ ఖమ్మంలో సోమవారం వినతిపత్రం అందించారు.

జనాలను సమీకరించాలి

హైదరాబాద్‌లో ఈనెల 14న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ప్రతి నియోజకవర్గం నుంచి 300 మందిని సమీకరించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజధానికి జనాన్ని తరలించేందుకు బస్సులు, వారికి భోజనం, అల్పాహారం ఏర్పాట్లు చూడాలన్నారు. ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ కలెక్టర్ రాధిక గుప్తా, జడ్పీ సీఈవో అప్పారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఏలూరి శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సత్యనారాయణ, ఆర్డీఏ కిషన్ పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోని అన్ని రకాల ఫైళ్లు ఈ–ఆఫీస్‌లోనే చేపట్టాలని, భౌతికంగా నిర్వహిస్తే అంగీకరించేది లేదని కలెక్టర్ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాగిత రహిత ఫైళ్లతో భద్రత ఉంటుందని, ట్యాంపరింగ్‌కు అవకాశం లేదన్నారు. పాత దస్త్రాలపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఐడీవోసీలోకి తరలిన కార్యాల



యాలు పాత భవనాల్లో సామగ్రి పూర్తిగా ఖాళీ చేయాలని, ఆ భవనాలు కేటాయించిన శాఖలకు అప్పగించాలన్నారు. జీవో నెం.58, 59పై ప్రత్యేక శిబిరాలు నిర్వహించి దరఖాస్తులు సేకరించాలన్నారు. గ్రామాల్లో డొంకలు, పంట పొలాలకు రహదారులపై నివేదిక సమర్పించాలన్నారు. మండలాలకు సంబంధించిన దస్త్రాలు ఎవరివి వారికి అప్పగించాలన్నారు. మామిడి పండ్లు కార్బైడ్ ద్వారా మగ్గబెట్టే అవకాశం ఉన్నందున నిరంతర తనిఖీలు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ స్నేహలత, శిక్షణ కలెక్టర్ రాధిక గుప్తా, డీఆర్వో శిరీష, ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం వివరాలపై సమీక్ష

అకాల వర్షాలకు జరిగిన పంట నష్టంపై సర్వే వివరాలతో కూడిన నివేదికలో సవరణలు త్వరగా పూర్తి చేయాలని, నష్టపోయిన ప్రతి రైతు వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఏవో విజయనిర్మల, ఉద్యాన అధికారి అనసూయ, ఏడీఏలు, ఏవోలు పాల్గొన్నారు.

# అసంపూర్తి పనులు.. ప్రజల అవస్థలు

వరంగల్ : కొడకండ్ల – అవుతాపురం గ్రామాల మధ్య రెండేళ్ల క్రితం ప్రారంభించిన రెండు వరుసల రహదారి నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. రోడ్డుపై వాహనాలు తిరగలేని పరిస్థితి నెలకొంది. కొడకండ్ల నుంచి వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారికి అనుసంధానమయ్యేలా పెద్దవంగర మండలంలోని అవుతాపురం వరకు రూ.8.7 కోట్లతో 2021–22 సంవత్సరంలో 11 కి.మి. పొడవైన రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ముందుగా రోడ్డు విస్తరణ, కంకర పనులు ప్రారంభించిన గుత్తేదారు.. రంగాపురం, గంట్లకుంట, అవుతాపురం గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. అవుతాపురం సమీపంలో ఉన్న లోలెవల్ కల్వర్టును పైపులు వేసి ఎత్తుగా నిర్మించే సమయంలో వరద ఉద్ధృతికి కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో పనులు నిలిచిపోయాయి. నేటికీ పనులను తిరిగి ప్రారంభించకపోవడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. పెద్ద గుంతలు పడి కంకర తేలడంతో తిరగలేకపోతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కొడకండ్లతో పాటు సూర్యాపేట జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు వరంగల్‌కు వచ్చేందుకు దూరం తగ్గుతుంది. అవుతాపురం నుంచి వరంగల్ –ఖమ్మం జాతీయ రహదారి వరకు, పాలకుర్తి–నాంచారిమడూరు రెండు వరుసల రోడ్డు నిర్మాణం పూర్తయి ఏడాదిన్నర గడిచింది. కొడకండ్ల – అవుతాపురం



రహదారి నిర్మాణ పనులు నిలిచిపోవడంతో రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పూర్తి కాని వంతెన నిర్మాణం

రహదారి నిర్మాణంలో భాగంగానే అదే సంవత్సరంలో రూ.3.95 కోట్లతో కొడకండ్ల సమీపంలో ఉన్న బయ్యన్నవాగుపై హైలెవల్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రారంభంలో పనులు వేగంగా జరిగినప్పటికీ స్తంభాలు నిర్మించిన తర్వాత ఆర్నెల్ల నుంచి పనులు నిలిచిపోయాయి. వంతెన పైకప్పు, ఇరు వైపులా రోడ్డును అనుసంధానం చేయాల్సిన పనులు మిగిలాయి. గతంలో నర్సింగాపురం, గంట్లకుంట, రంగాపురం గ్రామాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు ఈ వంతెన వద్ద ఉన్న కల్వర్టు ద్వారా కొడకండ్లకు రాకపోకలు సాగించే వారు. ప్రస్తుతం మూడు కి.మీ.దూరం తిరిగి వెళ్తున్నారు. అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణంపై అధికారులను ప్రశ్నించగా.. పనులు చేపట్టిన గుత్తేదారు అకస్మాత్తుగా మరణించడంతో పనులు నిలిచిపోయాయన్నారు. మరో గుత్తేదారుతో పనులను పూర్తి చేయిస్తామన్నారు. వెంటనే రోడ్డు, వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పక్షం రోజుల్లో ప్రారంభిస్తాం–సురేష్, పంచాయతీరాజ్ శాఖాధికారి

ఆరు మాసాలుగా నిలిచిపోయిన రోడ్డు, వంతెన పనులను పక్షం రోజుల్లో ప్రారంభించి పూర్తి చేస్తాం. ఇటీవల వరంగల్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో.. కొడకండ్ల – అవుతాపురం రోడ్డు, బయ్యన్నవాగు వంతెన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి దయాకర్‌రావు నిర్ణయించారు. పనులు ప్రారంభించి రెండు మాసాల్లో పూర్తి చేస్తాం.

# అమ్మ కడుపు చల్లగా..



ఖమ్మం : భద్రాద్రి జిల్లాలో ఏజెన్సీ మండలానికి చెందిన ఓ బాలికకు పెద్దలు ప్రేమ వివాహం జరిపించారు. పదహారేళ్లకే ఆమె గర్భం దాల్చింది. కానీ బిడ్డ ఎదుగుదల సవ్యంగా జరగలేదు. మరోవైపు తల్లి ప్రాణానికీ ముప్పు తలెత్తింది. దీంతో గర్భ విచ్ఛిత్తి చేసి వైద్యులు ప్రాణం కాపాడారు. చింతకాని మండలానికి చెందిన ఓ యువతి హైరిస్క్ ప్రెగ్నెన్సీ దాల్చారు. ఐదో నెలలో తీవ్ర రక్తస్రావమైంది. గర్భస్థ శిశువు చనిపోయింది. ఖమ్మంలోని సర్వజన ఆస్పత్రిలో గర్భిణిని చేర్పించి చికిత్స అందించారు. యువతి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మార్చి 31న ఆమె మృతిచెందారు. రక్తం గడ్డకట్టే స్వభావం కారణంగా ప్రాణహాని కలిగినట్లు వైద్య నిపుణులు తెలిపారు.

మాతృత్వం అనేది ప్రతి స్త్రీ కల. ఆ మధుర క్షణాల కోసం భరించని బాధనేది ఉండదంటారు. పుట్టిన బిడ్డ ద్వారా కలిగే స్పర్శతో.. తొమ్మిది నెలల్లో భరించిన బాధంతా దూదిపింజలా ఎగిరిపోతుందనేది ప్రతి అమ్మ మాట. నాణేనికి మరోవైపు చూస్తే కొందరు నవమాసాలు మోసిన బిడ్డను కళ్లారా చూడలేకపోతున్నారు. గర్భంలో శిశువు, కాన్పు సమయాల్లో తల్లి మృత్యువాతపడుతున్న విషాద ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. పలు కారణాలతో తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై గర్భిణులు అశ్రద్ధ చూపుతున్నారు. అలాంటి సందర్భాల్లో వారిలో అవగాహన కల్పించి, అండగా నిలవాల్సిన బాధ్యత కుటుంబసభ్యులు, వైద్యశాఖ, క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉంది. నేడు 'జాతీయ మాతృత్వ రక్షణ దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం. గర్భం దాల్చాక కొందరు పౌష్టికాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. వీరితో పాటు రక్తహీనత, బీపీ, షుగర్, థైరాయిడ్, ఉబ్బసం, హృద్రోగాలతో (హైరిస్క్) బాధపడుతున్నవారు ప్రసవ సమయంలో క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలున్నప్పుడు వైద్యుల పర్యవేక్షణలో తగిన జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే మాతా, శిశు మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. బాల్య వివాహాలు మరో ప్రధాన కారణంగా నిలుస్తోంది. కడుపులో బిడ్డ అడ్డం తిరిగి ఉమ్మనీరు ఎక్కువ మోతాదులో కోల్పోవడమూ ఇటీవల కాలంలో సమస్యగా మారుతోంది. రక్తహీనత సమస్యతో పురిట్లోనే శిశువును కోల్పోతున్నవారున్నారు. గర్భిణులు స్వీయ జాగ్రత్తలు పాటిస్తూ వైద్యుల సలహాలు ఆలకిస్తే ఈ గండం నుంచి గట్టెక్కడం సులభం.

ఆరోగ్య సంరక్షణే ప్రధానం..

డాక్టర్ దివ్య, డీజీవో (జిల్లా సర్వజన ఆస్పత్రి)

స్త్రీ తల్లి అయ్యే తరుణంలో సంపూర్ణ శక్తిమంతురాలు కావాలి. పురిటి వేదన భరించాలంటే కొత్త శక్తి కూడగట్టుకోవాలి.

గర్భ నిర్ధారణ జరగగానే ఆశా కార్యకర్త, ఏఎన్ఎంలను సంప్రదించి ఎంసీపీ(మదర్ ఛైల్డ్ ప్రొటెక్షన్) కార్డు తీసుకోవాలి.

మూడో నెలలో వైద్యుల సలహాతో రక్తపరీక్షలు చేయించాలి. ధనుర్వాతం రాకుండా టీటీ(టెటానస్ టెక్సాయిడ్) ఇంజెక్షన్ తీసుకోవాలి.

4 నుంచి 7 నెలల మధ్య ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి.

పిండంలో అవయవ లోపాలుంటే గుర్తించేందుకు ఐదోనెలలో టిఫా స్కానింగ్ చేయించాలి.

శిశువు ఎదుగుదలకు సంబంధించి 10 నుంచి 13 వారాల సమయంలో, 8వ నెలలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు చేయించాలి. తొమ్మిదో నెలలో రెండుసార్లు, ఆ తర్వాత కాన్పు జరిగే వరకు వారానికోసారి వైద్యులను సంప్రదించాలి.

జీవనశైలి, వయస్సు, దీర్ఘకాలిక వ్యాధుల కారణంగా తలెత్తే సమస్యలను అధిక ప్రమాద గర్భధారణ (హైరిస్క్)గా పరిగణిస్తాం. ఇలాంటి కేసుల్లో తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రభావం ఉంటుంది.

రక్తహీనత, బీపీ, అధిక బరువు, మధుమేహం, హెచ్ఐవీ పాజిటివ్, ప్రీ ఎక్లంప్రిసియా, న్యూరల్ ట్యూబ్ లోపం, ఒకటి కంటే ఎక్కువ పిండాలున్నట్లయితే తగిన చికిత్స పొందాలి. మానసిక ఒత్తిడి లేకుండా జాగ్రత్తపడాలి.

ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా చూసుకోవాలి.

# లబ్ధిదారుల్లో ఆశల చిగురింత..!



అశ్వారావుపేట : చాలాకాలంగా వాయిదా పడుతూ వస్తున్న రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. ఇటీవల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఈ అంశంపై టెలికాన్ఫరెన్స్‌లో అధికారులకు సూచనలు చేయగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మూడు రోజుల కిందట వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో సమీక్షించారు. రెండో విడత పంపిణీకి కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. గొర్రెల యూనిట్ల సేకరణ, రవాణా, లబ్ధిదారుల నుంచి డిపాజిట్ల వసూలు ప్రక్రియ వెంటనే పూర్తిచేయాలని సూచించారు. దీంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

పటిష్ఠ చర్యలు..!

రెండో విడతతో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటోంది. ఎంపికచేసిన వారి ఇళ్లకు వెళ్లి అధికారులు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఒకవేళ లబ్ధిదారులు చనిపోతే నామినీగా భార్య లేదా కుమారులను ఎంపిక చేసి పంపిణీ ప్రక్రియ పూర్తిచేయనున్నారు. పారదర్శకత కోసం ఈసారి జీపీఎస్ సౌకర్యమున్న వాహనాల్లోనే జీవాలను రవాణా చేయనున్నారు.

జిల్లాలో పంపిణీ ఇలా..

తెలంగాణ ప్రభుత్వం 2017లో చేపట్టిన ఈ పథకానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 11,050 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా, తొలి విడతలో దశలవారీగా 7,511 మందికి గొర్రెలు అందజేశారు. ఒక్కో యూనిట్‌కు 21 జీవాల (1పొట్టేలు, 20గొర్రెలు) చొప్పున మొత్తం 1,57,731 గొర్రెలు అందజేశారు. రెండో విడత కోసం 3,539 మంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. వీరిలో 1,412 మంది తమ వాటాగా చెల్లించాల్సిన డిపాజిట్లకు ఆన్‌లైన్ పేమెంట్ ప్రక్రియ పూర్తి చేశారు. మిగిలిన వారు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వీరందరికీ త్వరలో జీవాలు అందనున్నాయి. మొదటి విడత సమయంలో గొర్రెల యూనిట్ విలువ రూ.1.25లక్షలు ఉండేది. లబ్ధిదారుల వాటా రూ.31,250 కాగా, మిగతా సొమ్మును ప్రభుత్వమే భరించేది. ప్రస్తుతం జీవాల ధరలు పెరగడంతో ప్రభుత్వం యూనిట్ విలువను రూ.1.75 లక్షలకు పెంచింది. లబ్ధిదారుల వాటా రూ.43,750కి చేరింది. ఈమేరకు రెండో విడత లబ్ధిదారులపై రూ.12,500 అదనపు భారం పడుతోంది. అలాగే ప్రభుత్వంపైనా అదనపు భారం పడుతుంది. ఈ నెలాఖరుకల్లా గొర్రెల పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీకి కార్యాచరణ మొదలైంది. లబ్ధిదారుల జాబితాతోపాటు, పూర్తి వివరాలను ఈల్యాబ్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం. జిల్లాలో ఇంకా 2,137 మంది డిపాజిట్ ఆన్‌లైన్ పేమెంట్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. అర్హులు ఆన్‌లైన్ చెల్లింపుల వివరాల కోసం ఆయా మండలాల్లోని పశు వైద్యాధికారులను సంప్రదించి, త్వరితగతిన పూర్తి చేసుకోవాలి. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పంపిణీ ప్రక్రియ చేపడతాం. బి.పురందర్, జిల్లా పశువైద్యాధికారి

# గనుల్లో నారీ'మణులు'


భూపాలపల్లి : సింగరేణి అభివృద్ధిలో మహిళలు తమ వంతు పాత్రను పోషిస్తున్నారు. ప్రతికూల పరిస్థితుల్లో ప్రాణాలను తెగించి నిర్వహించే విధులకు మేము సైతం అంటున్నారు. పురుషులకు దీటుగా కంపెనీలో సత్తా చాటేందుకు వనితలు ముందుకొస్తున్నారు. కారుణ్య నియామకాల ద్వారా కొందరైతే.. రాత పరీక్షల ద్వారా మరికొందరు కొలువుల్లో చేరుతున్నారు. గతంలో భూగర్భంలో బొగ్గు వెలికితీత అంటే వణికిపోయే పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం యాంత్రీకరణ, పటిష్ఠమైన రక్షణ చర్యలతో బావులు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. దీంతో సింగరేణిలో కొలువు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. రెండు మూడు ఏళ్లుగా మహిళా ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. మూడేళ్లలో సింగరేణి వ్యాప్తంగా 5632 కారుణ్య నియామకాలు జరిగాయి. అందులో 542 మందికి పైగా యువతులు బదిలీ వర్కర్లుగా కొలువు సాధించారు. ఉద్యోగం చేస్తూ కుటుంబానికి బాసటగా నిలుస్తున్నారు. ప్రస్తుతం 44,211 మంది ఉద్యోగులు పని చేస్తుండగా వీరిలో మహిళలు 1296 మంది.. ఎక్కువగా కార్పొరేట్‌లో 278 మంది, మందమర్రి ఏరియాలో 229 మంది, ఆర్జీ–1లో 222 మంది పని చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివిన అనేక మంది మహిళలు తమ కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కారుణ్య నియామకాల ద్వారా బదిలీ వర్కర్లుగా ఉద్యోగంలో చేరుతున్నారు. బీటెక్, ఎంటెక్ లాంటి వృత్తి విద్యా కోర్సులతో పాటు, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకాం లాంటి పీజీ డిగ్రీలు చదివిన వారు, గ్రాడ్యుయేట్లు సైతం ఉన్నారు. ఏ బాధ్యత అప్పగించినా ఆత్మస్థైర్యంతో పని చేస్తున్నారు. జీఎం కార్యాలయాలు, ఏరియా వర్క్‌షాపు, ఏరియా స్టోర్స్, ఏజెంట్ కార్యాయాలు, ఇంటర్నల్ ఆడిట్ ఇలా.. ఎక్కడ చూసినా అన్నింటిలో మహిళా మణులు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్నారు.

# పాతాళానికి జలం

భూపాలపల్లి : జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఎండల తీవ్రత, నీటి వినియోగం ఎక్కువగా ఉండటంతో రోజురోజుకు భూగర్భ జలం లోతుకు వెళ్తోంది. అవసరానికి మించి నీటి వినియోగంతో పాటు నీటి వృథా, నీటి వసతి ఎక్కువగా అవసరమయ్యే పంటలను సాగు చేస్తుండటంతో భూగర్భ జలాలు పాతాళంలోకి వెళ్తున్నాయి. నీటి పొదుపు చర్యలు చేపట్టాలని, వినియోగంలో మెలకువలు పాటిస్తూ పొదుపు చర్యలు చేపట్టాలని భూగర్భ జల శాఖ అధికారులు చెబుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాల సరాసరి 8.59 మీటర్ల లోతులో ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలుపుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పాతాళ గంగ 7.98 మీటర్ల లోతులో ఉండగా నెల వ్యవధిలో మార్చి నెల వచ్చే సరికి 8.59 మీటర్ల లోతులోకి వెళ్లిపోయింది. అంటే ఒక నెలలో 0.61 మీటరు లోతుకు పడిపోయింది. ఏప్రిల్, మే, జూన్ వరకు అంటే మరో మూడు నెలల వరకు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉండటంతో జిల్లాలో భూగర్భ జలాలు మరింత లోతుకు వెళ్లే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. నీటిని అవసరానికి మించి వినియోగించడమే కాకుండా వృథాను అరికట్టకపోవడంతో నీటి మట్టాలు తగ్గుతున్నాయని తెలుపుతున్నారు.

మూడు మండలాల్లో అత్యధికం

జిల్లాలోని 11 మండలాల్లో అత్యల్పంగా కాటారం మండలంలో 20.98 మీ., మహదేవ్‌పూర్ మండలంలో 12.97 మీ., పలిమెల మండలంలో 9.39 మీ. లోతులో నీరు ఉండటం ఆందోళన కలిగించే విషయం..



భూగర్భ జలాలు తక్కువగా ఉన్నటువంటి మండలాల్లో ఇప్పటి నుంచే నీటి రక్షణ చర్యలు చేపట్టకపోతే రానున్న రోజుల్లో నీటి సమస్య మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. మూడు మండలాల్లో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

నీటి పొదుపు ఎంతో ముఖ్యం

జిల్లాలో భూగర్భ జల రక్షణకు చర్యలు చేపట్టాల్సి ఉంది. అన్నదాతలు పంటలకు అవసరానికి మించి నీటిని వాడకుండా పొదుపు చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా రైతులు తక్కువ నీరు వినియోగమయ్యే ఆరుతడి పంటలను పండించేందుకు మొగ్గు చూపాలి. పంటలకు నీరు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం విద్యుత్తు సరఫరా చేస్తున్నందున ఇష్టానుసారంగా బోర్ల నుంచి నీటిని తోడేస్తున్నారు. అలా కాకుండా పంటకు సరిపోను నీటిని వాడుకునేలా అన్నదాతల్లో మార్పు రావాల్సిన అవసరం ఉంది. ఆరుతడి పంటలతో పంట మార్పిడి జరిగి భూమి కూడా సారవంతమయ్యే అవకాశాలు లేకపోలేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

అవసరానికి మించి వినియోగించకూడదు– శ్రీనివాసరావు, జిల్లా భూగర్భ జలశాఖ అధికారి

జిల్లాలో ప్రతి నెలా భూగర్భ జలాల నిల్వలను అంచనా వేస్తుంటాం. ప్రస్తుతం జిల్లాలో భూగర్భ జలాలు 8.59 మీటర్ల లోతులో ఉన్నాయి. ప్రతి ఒక్కరూ నీటిని అధికంగా వాడకుండా పొదుపుగా వాడుకోవాలి. భూగర్భ జలాలను ఎక్కువగా వాడటంతో ఇంకిపోతున్నాయి. పాంపాండ్స్, చెక్‌డ్యాంలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలి. అలాగే ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతను నిర్మించుకోవాలి. జల రక్షణ చర్యలు చేపట్టడంతో భూగర్భ జలాలు తగ్గకుండా ఉంటాయి.

# తీగల వంతెనకు తుది మెరుగులు

కరీంనగర్ : తీగల వంతెన పనులు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. మిగిలినవి పూర్తి చేసేందుకు వేగం పెంచారు. అప్రోచ్ రోడ్‌తోపాటు డైనమిక్ లైటింగ్ సిస్టం పనులు జరుగుతున్నాయి. రోడ్లు, భవనాల శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

మిగిలిన పనులు ఇలా...సదాశివపల్లి నుంచి వంతెన వరకు రాజీవ్ రహదారి హైవే నుంచి వంతెన వరకు అప్రోచ్ రోడ్ పనులు తుది దశలో ఉన్నాయి. తారు వేసి సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాల్సి ఉంది. వంతెన మధ్యలో ఆరు మీటర్ల స్లాబ్ మిగిలి ఉంది. అక్కడ స్టీల్ అల్లకం చేస్తున్నారు. రోడ్డు ప్లాట్‌ఫాం పనుల్లో వేగం పెంచారు.రెండు పెద్ద తెరల ఏర్పాటుతోపాటు లైటింగ్‌కు సంబంధించిన పనులు కూడా జరుగుతున్నాయి. రెండు వైపులా వేగవంతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించారు.

అయిదేళ్ల కిందట పనులు ప్రారంభం..

ఇతర జిల్లాల నుంచి కరీంనగర్ మీదుగా వరంగల్‌కు వెళ్లేందుకు ట్రాఫిక్ రద్దీ సమస్యను అధిగమించడానికి, దూరాన్ని తగ్గించేందుకు వీలుగా రాజీవ్ రహదారి సమీపంలో ఉన్న మానేరుపై తీగల వంతెన నిర్మాణానికి కార్యాచరణ రూపొందించారు. 2018 ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు. మొత్తం రూ.183 కోట్ల వ్యయంతో చేపట్టాల్సిన పనులు భూసేకరణలాంటివి పెరిగాక రూ.243 కోట్లకు చేరుకుంది. కమాన్ నుంచి సదాశివపల్లి వరకు అప్రోచ్ రోడ్‌తో కలిపి 4–7 కిలోమీటర్ల రహదారి వంతెన నిర్మాణంతో పనులు జరుగుతున్నాయి.

14లోగా పనులు పూర్తి చేయండికరీంనగర్ పర్యాటక శోభను పెంచుతూ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న తీగల వంతెన నిర్మాణ పనులు ఈనెల 14లోగా పూర్తి చేయాలని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు.నగర మేయర్ సునీల్‌రావు, జిల్లా కలెక్టర్ ఆర్.వి.కర్ణన్, పోలీసు కమిషనర్ సుబ్బారాయుడుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బ్రిడ్జి నుంచి సదాశివపల్లి వరకు రోడ్డు పనులు యుద్ధ ప్రాతిపదికన చేసేలా పర్యవేక్షణ పెంచాలన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ సాంబశివరావు, అధికారులు, కార్పొరేటర్లు ఉన్నారు.

## జస్టిస్ ఫర్ చంద్రబాబు క్యాంపెయిన్‌కు 62 దేశాల నుంచి అనూహ్య స్పందన



ఢిల్లీ : ఏపీ టుమారో సంస్థ మహిళా సభ్యుల నిర్వహించిన జస్టిస్ ఫర్ చంద్రబాబు నాయుడు క్యాంపెయిన్‌కు అనూహ్య స్పందన లభించింది. చంద్రబాబు నాయుడుకు సత్వర న్యాయం జరగాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాసిన వినతి పత్రాన్ని change.org/chandrababu అనే ప్రముఖ అంతర్జాతీయ సైట్‌లో ఏపీ టుమారో సంస్థ సంతకాల సేకరణకు పెట్టింది.

కేవలం మూడు రోజుల్లో 62 దేశాల నుంచి 25 వేలకు పైగా డిజిటల్ సంతకాలు సేకరణ జరిగింది. 62 దేశాల నుంచి వచ్చిన 25 వేల మంది డిజిటల్ సంతకాలను ఏపీ టుమారో సంస్థ సేకరించింది. 25 వేల డిజిటల్ సంతకాలను సుప్రీంకోర్టులోని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ కార్యాలయానికి ఏపీ టుమారో సంస్థ మహిళా సభ్యులు అందించారు.

# చంద్రబాబుపై కేసు నమోదు తప్పు



న్యూఢిల్లీ: టీడీపీ అధినేత చంద్రబాబుపై కేసు నమోదు తప్పు అని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు చాలా మంచివారని.. వ్యక్తిగతంగా ఆయన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. కోర్టుల్లో రాజకీయ జోక్యం ఎక్కువగా కనిపిస్తుందన్నారు. చంద్రబాబును తక్షణం జైలులో నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు తప్పు చేసినట్లు రుజువులు ఉన్నాయా? కేవలం ఆయనపై ఆరోపణలు మాత్రమే ఉన్నాయన్నారు. ఓబీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ 2005లో రాజ్యాంగ సవరణ ద్వారా చట్టం చేసి 27శాతం రిజర్వేషన్లను ఇచ్చిందని తెలిపారు. 75 సంవత్సరాల్లో ఓబీసీలు రాజకీయంగా ముందుకు వెళ్లలేదని... ఓబీసీలకు కూడా రాజకీయ రిజర్వేషన్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ లాగా చంద్రబాబును ఇబ్బంది పెడుతున్నారన్నారు. 37 రోజులుగా జైలులో పెట్టడం తప్పు అని చెప్పుకొచ్చారు. వాజ్ పాయ్, పీవీ నరసింహారావు కుట్రల ఫలితంగా అప్పట్లో అద్వానీపై కేసులు పెట్టారని.. దాని ఫలితంగా ఆయన ఇప్పటికీ ప్రధాని కాలేకపోయారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని... తెలంగాణలో 75 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడు తరహా రాజకీయాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌తో జతకట్టిన పార్టీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ– జనసేన పొత్తును ఆహ్వానిస్తున్నామన్నారు. 10 నుంచి 15 శాతం ఓటు బ్యాంకు ఏపీలో కాంగ్రెస్‌కు పెరిగిందన్నారు. తమ పార్టీతో కలసిన వారు తప్పకుండా అధికారంలోకి వస్తారని చింతామోహన్ పేర్కొన్నారు.

## శ్రీశైలంలో వైభవంగా దసరా మహోత్సవాలు



నంద్యాల: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామి దేవాలయంలో దసరా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తుల రద్దీ భారీగా పెరిగింది. రెండవరోజు బ్రహ్మచారిణి అలంకారంలో శ్రీశైలం భ్రమరాంబాదేవి అమ్మవారి భక్తులకు దర్శనమిస్తున్నారు. సాయంత్రం స్వామిఅమ్మవార్లకు మయూర వాహనసేవ శ్రీశైలం పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

దసర ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. అమ్మవారికి శ్రీచక్రార్చన, నవావరణార్చన, విశేష కుంకుమార్చనలు, రుద్రహెూమం, చండీహెూమం, రుద్రపారాయణ, చండీపారాయణ, జపానుష్టానాలు చేయనున్నారు.

## ఎమ్మెల్యే గంటా ఇంటివద్ద ఉద్రిక్తత



విశాఖపట్నం: విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇంటివద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. నల్ల బెలూన్లు ఎగురవేత కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి పోలీసులు విఫలయత్నం చేశారు. దీంతో పోలీసులకు, టీడీపీ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనకు వస్తే వినతిపత్రాలు తీసుకునే ఆనవాయితీ ఉండేదన్నారు.

జగన్ విశాఖ పర్యటనలో అవేమీ లేవని.. పైగా ప్రతపక్షాలను నిర్భంధిస్తున్నారని మండిపడ్డారు. ఉత్తరాంధ్రపై కపట ప్రేమ చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలవడానికి లెటర్ ఇచ్చినందుకు అరెస్ట్ చేస్తారా?.. ఇది నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. సుప్రీంకోర్ట్‌లో చంద్రబాబుకు ఊరట వస్తుందనే విశ్వాసం తమకు ఉందని గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## చంద్రబాబు ఆరోగ్యంపై ఏసీబీ కోర్టులో పిటిషన్.. రేపు విచారణ



విజయవాడ: టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆరోగ్యంపై ఏసీబీ కోర్టులో ఆయన తరపు న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. చంద్రబాబు ఆరోగ్యంపై తమకు ఎలాంటి రిపోర్ట్ ఇవ్వటం లేదని పిటిషన్‌లో చంద్రబాబు తరపు న్యాయవాదులు పేర్కొన్నారు.

చంద్రబాబు ఆరోగ్యంపై తమకు ఆందోళన ఉందంటూ పిటిషన్లలో న్యాయవాదులు ప్రస్తావించారు. చంద్రబాబు ఆరోగ్యంపై తమకు హెల్త్ బులిటెన్ రిలీజ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని పిటిషన్‌లో న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై రేపు విచారణ చేపడతానని ఏసీబీ కోర్టు న్యాయమూర్తి తెలిపారు.




హమాస్ దాడుల తర్వాత ఇజ్రాయెల్ దళాలు గాజాను చుట్టుముట్టిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ బలగాలు సుదీర్ఘకాలం గాజాలో ఉండటం పెద్ద పొరబాటుగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. యుద్ధాల్లో పాటించాల్సిన నిబంధనలను ఇజ్రాయెల్ అమలు చేస్తుందని తాము నమ్ముతున్నట్లు చెప్పారు. అమాయక పౌరులకు నీరు, ఆహారం, ఔషధాలు అందేట్లు చూడాలని సూచించారు. ఆయన సీబీఎస్ న్యూస్ సంస్థతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గాజాను సుదీర్ఘకాలం పాటు ఇజ్రాయెల్ తన ఆధీనంలో ఉంచుకొంటుందని తాను భావించడంలేదని బైడెన్ వెల్లడించారు. అంతకంటే పాలస్తీనీయుల ఆధ్వర్యంలో అక్కడి పాలన నిర్వహించాలన్నారు. ఒక వేళ సుదర్ఘీకాలం గాజాలోనే ఇజ్రాయెల్ దళాలు ఉంటే అది పెద్ద పొరబాటుగా మారుతుందన్నారు. “ప్రస్తుతం గాజా పరిస్థితి చూడండి.. అక్కడ ఉన్న అతివాద హమాస్ శక్తులు మొత్తం పాలస్తీనా ప్రజలకు ప్రాతినిధ్యం వహించవు” అని పేర్కొన్నారు. ఇక బైడెన్ ఇజ్రాయెల్‌ను సందర్శిస్తారన్న ప్రచారంపై శ్వేతసౌధం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధి మాట్లాడుతూ.. “మీకు చెప్పేందుకు ఇప్పటి వరకు అటువంటి ప్రతిపాదన ఏమీ లేదు” అని తెలిపారు. ఈ దిశగా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. ఆదివారం కూడా జోబైడెన్ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూతో ఫోన్‌లో మాట్లాడారు. హమాస్ దాడుల తర్వాత ఆయన ఇజ్రాయెల్ ప్రధానితో మాట్లాడటం ఇది ఐదోసారి. మరోవైపు ఇజ్రాయెల్ దళాలు గ్రౌండ్ ఆపరేషన్‌కు రంగం సిద్ధం చేసుకొని గాజా సరిహద్దుల వద్ద ఎదురు చూస్తున్నాయి. ఇప్పటికే దాదాపు కొన్ని లక్షల మంది ప్రజలను ఉత్తర గాజా ఖాళీ చేసి దక్షిణ ప్రాంతాలకు వెళ్లిపోవాలని ఐడీఎఫ్ బలగాలు హెచ్చరించాయి. ఆదివారం ఉదయం 10 నుంచి 1 గంట వరకు కారిడార్‌ను ఏర్పాటు చేశారు. దీంతో లక్షల మంది వలస బాట పట్టారు. వారిని హమాస్ అడ్డుకుంటోంది. ప్రజలను రక్షణ కవచంగా వాడుకోవాలన్నది ఆ సంస్థ ఆలోచనగా ఉంది. పౌరులు వెళుతున్న వాహనాన్ని హమాస్ అడ్డుకున్న ఫొటోలను ఇజ్రాయెల్ తన అధికారిక ఎక్స్ (ట్విటర్) ఖాతాలో షేర్ చేసింది.




ప్రయాగ్‌రాజ్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2005–06 నిఠారీ వరుస హత్యల కేసులో ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టు సోమవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ ఘటనకు సంబంధించిన పలు కేసుల్లో దోషులుగా తేలి మరణశిక్ష ఎదుర్కొంటున్న సురేందర్ కోలీ, మానిందర్ సింగ్ పంధేర్‌ను నిర్దోషులుగా ప్రకటించింది. సరైన సాక్ష్యాలు లేని కారణంగానే వారిని నిర్దోషులుగా పరిగణిస్తున్నట్లు కోర్టు తెలిపింది. దీంతో ఈ కేసుల్లో వారి మరణశిక్ష రద్దయినట్లైంది.

**ఏంటీ కేసు..** నోయిడాలోని నిఠారీ గ్రామంలో 2005 నుంచి 2006 మధ్య ఈ వరుస హత్యలు చోటుచేసుకున్నాయి. 2006 డిసెంబరులో స్థానిక వ్యాపారవేత్త మానిందర్ సింగ్ పంధేర్ ఇంటి సమీపంలోని ఓ మురికి కాలువలో కొన్ని మానవ అవశేషాలు కన్పించాయి. ఆ శరీరభాగాలను గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. అనంతరం దర్యాప్తు చేపట్టగా ఈ వరుస హత్యలు వెలుగులోకి వచ్చాయి. దర్యాప్తులో పంధేర్ ఇంటి వెనుక పెరట్లో అనేక మంది చిన్నారులు, యువతుల అస్థిపంజరాలు బయటపడ్డాయి. ఇవన్నీ ఆ ప్రాంతంలో ఏడాదిగా కన్పించకుండా పోయిన పేద చిన్నారులు, యువతులవేనని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం ఈ కేసులో సీబీఐ దర్యాప్తు చేపట్టగా.. ఒళ్లు గగుర్పొడిచే విషయాలు వెలుగులోకి వచ్చాయి. పంధేర్ ఇంట్లో పనిచేసే సురేందర్ కోలీ.. చిన్నారులకు స్వీట్లు, చాక్లెట్ల ఆశ చూపి ఇంటికి ఆహ్వానించేవాడని దర్యాప్తులో తేలింది. అనంతరం వారిని హత్య చేసి, మృతదేహాలపై లైంగిక దాడి చేశారని ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. ఆ తర్వాత శరీర భాగాలను ఇంటి వెనుక భాగంలో విసిరేశారని సీబీఐ ఆరోపించింది. వీరు నరమాంసభక్షకులనే ఆరోపణలు కూడా వచ్చాయి. దీంతో.. పంధేర్, సురేందర్ కోలీపై మొత్తం 19 కేసులు నమోదు చేశారు. సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా వీటిలో మూడింటిని మూసివేశారు.




ముంబయి: దేశీయ ఐటీ కంపెనీ ‘టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్’ 16 మంది ఉద్యోగులను తొలగించింది. మరోవైపు కంపెనీతో వ్యాపారం చేస్తున్న ఆరుగురు విక్రేతలను నిషేధించింది. ‘లంచాలకు ఉద్యోగాలు’ కుంభకోణంలో వీరి పాత్ర ఉన్నట్లు గుర్తించిన కంపెనీ ఈ మేరకు చర్యలు తీసుకుంది. ఈ వివరాలను టీసీఎస్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. ఈ కుంభకోణంలో మొత్తం 19 మంది ఉద్యోగుల పాత్ర ఉన్నట్లు టీసీఎస్ గుర్తించింది. వీరిలో 16 మందిని తొలగించగా.. మరో ముగ్గురిని ‘రీసోర్స్ మేనేజ్‌మెంట్’ విధుల నుంచి బదిలీ చేసింది. ఆరుగురు విక్రేతలు సహా వారి అనుబంధ యజమానులు కంపెనీతో ఎలాంటి వ్యాపారం చేయకుండా నిషేధించింది. విక్రేతలతో కలిసి కొంత మంది ఉద్యోగులు కొత్త ఉద్యోగుల నియామకాల్లో అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఈ ఏడాది జూన్‌లో ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఉద్యోగులకు భారీ ఎత్తున ముడుపులు ముట్టినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. కంపెనీకి చెందిన ఓ ప్రజా వేగు ఇచ్చిన సమాచారం ఆధారంగానే ఈ విషయం బయటకు వచ్చింది. ప్రాథమిక దర్యాప్తులో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన కంపెనీ.. లోతైన విచారణకు కమిటీని నియమించింది. నాలుగు నెలల పాటు దర్యాప్తు జరిపిన సదరు కమిటీ ఇటీవలే నివేదికను సమర్పించింది. దాని ఆధారంగానే కంపెనీ చర్యలు చేపట్టింది. ఈ కుంభకోణంలో మేనేజర్ స్థాయి ఉద్యోగుల పాత్ర లేదని గుర్తించినట్లు టీసీఎస్ వెల్లడించింది. ఈ స్కాంతో కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని.. ఆర్థికంగా ఎలాంటి నష్టం వాటిల్లలేదని స్పష్టం చేసింది. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని కంపెనీ తెలిపింది. అందుకనుగుణంగా ఎప్పటికప్పుడు పాలనా విధానాల్లో మార్పులు చేస్తామని పేర్కొంది. రీసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలోని ఉద్యోగులను మారుస్తూ ఉంటామని తెలిపింది. ఉద్యోగులు సహా కంపెనీతో సంబంధం ఉన్న ప్రతిఒక్కరూ ‘టాటా’ నియమ నిబంధనలకు కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై–సెప్టెంబరులో టీసీఎస్ రూ.11,342 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2022–23 ఇదే త్రైమాసిక లాభం రూ.10,431 కోట్లతో పోలిస్తే ఇది 8.7 శాతం అధికం. ఈ ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసిక లాభంతో పోల్చినా 2.4 శాతం ఎక్కువ. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ కార్యకలాపాల ద్వారా రూ.59,692 కోట్ల ఏకీకృత ఆదాయాన్ని ఆర్జించింది. 2022–23 జులై–సెప్టెంబరు ఆదాయం రూ.55,309 కోట్లతో పోలిస్తే ఇది 8 శాతం ఎక్కువ. తన 6 లక్షల మందికి పైగా ఉద్యోగులను పూర్తి స్థాయిలో కార్యాలయాలకు వచ్చి పనిచేయాలని కోరినట్లు టీసీఎస్ ప్రకటించింది. వర్క్ ఫ్రం హెూంకు స్వస్తి పలికినట్లు పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 40,000 మంది తాజా ఉత్తీర్ణుల నియామక లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేసింది. కంపెనీ ఇచ్చిన ఆఫర్ లెటర్లన్నిటినీ గౌరవిస్తామని.. వారిని ఉద్యోగంలోకి తీసుకోవడం కొంత ఆలస్యమైనా, తప్పనిసరిగా అవకాశం ఇస్తామని పేర్కొంది.

## అమరావతి అసైన్డ్ భూముల కేసు రీఓపెన్.. విచారణ వచ్చేనెల 1కి వాయిదా



అమరావతి: రాజధాని అమరావతి అసైన్డ్ భూముల కేసు వ్యవహారంలో కొత్త ఆధారాలు పరిగణనలోకి తీసుకుని విచారించాలని సీఐడీ దాఖలు చేసిన పటిషన్‌పై నేడు రాష్ట్ర హైకోర్టులో విచారణ జరిగింది. సీఐడీ అధికారులు ఇచ్చిన కొత్త ఆధారాలను ఉన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేసు రీఓపెన్‌కు అభ్యంతరాలు ఉంటే ప్రతివాదులు కౌంటర్ వేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా సీఐడీ తరపు న్యాయవాదులు న్యాయమూర్తికి కొన్ని ఆడియో ఫైల్స్‌ను అందించారు. మంగళవారం (అక్టోబర్ 17న) మరిన్ని ఆధారాలను వీడియో రూపంలో అందిస్తామని సీఐడీ తెలిపింది. అనంతరం విచారణను వచ్చే నవంబర్ 1కి హైకోర్టు వాయిదా వేసింది. అసైన్డ్ భూముల కేసులో ఇప్పటికే విచారణ పూర్తయింది. అయితే ఈ కేసులో మరో నలుగురి పేర్లను కొత్తగా చేర్చామని, రీఓపెన్ చేయాలని ఇటీవల సీఐడీ పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యవహారంలో తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని మాజీ మంత్రి నారాయణ గతంలో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం తీర్పును రిజర్వ్‌లో ఉంచిన విషయం తెలిసిందే.

## ఇంద్రకీలాద్రిపై వీఐపీలకు చెక్





విజయవాడ : ఇంద్రకీలాద్రిపై వీఐపీలకు చెక్ పెట్టనున్నారు. ఘాట్ రోడ్డు దిగువు నుంచి కొండపై అమ్మవారి సన్నిధానం వరకు కఠిన ఆంక్షలు విధిస్తున్నారు. అడుగడుగునా చెక్ చేసి టికెట్ ఉన్న భక్తులను మాత్రమే ఘాట్ రోడ్డు పైకి అధికారులు అనుమతిస్తున్నారు. నిన్న 80 వేల మందికి పైగా దుర్గమ్మను భక్తులు దర్శించుకున్నారు. ముఖ్యంగా వీఐపీల తాకిడితో సామాన్యులకు తిప్పలు తప్పడం లేదు. అధికారుల తీరుపైన మంత్రి కొట్టు సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇవాళ ఉదయం నుంచి ఇంద్రకీలాద్రిని పూర్తిగా పోలీసులు, రెవెన్యూ విభాగం ఆధీనంలోకి తీసుకుంది. ఘాట్ రోడ్డు పైకి టికెట్లు ఉన్న వారిని వృద్ధులను, వికలాంగులను మాత్రమే అనుమతిస్తున్నారు. వీఐపీలైనా టికెట్ కొనాల్సిందేనని హుకుం జారీ చేశారు. అంతరాలయ దర్శనాన్ని రద్దు చేశారు.

ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దుర్గమ్మ దర్శనమిచ్చారు. గాయత్రీదేవి అవతారంలో ఇవాళ రాత్రి 11 గంటల వరకు భక్తులకు అమ్మవారు అభయప్రదానం చేయనున్నారు. తొలిరోజు అధికంగా భక్తులు రావడంతో క్యూలైన్ల నిర్వహణను ఇవాళ అధికారులు కట్టుదిట్టం చేశారు.

**భ్రమరాంబదేవికి శ్రీచక్రార్చన :** శ్రీశైలంలోనూ దసరా మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు భ్రమరాంబదేవికి శ్రీచక్రార్చన, కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం బ్రహ్మచారిని అలంకారంలో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు మయూర వాహన సేవ జరగనుంది.

## తమన్నా చిన్నప్పటి వీడియో వైరల్

మిల్కీ బ్యూటీ తమన్నా తెలుగు ప్రేక్షకులకు 2005 సంవత్సరంలో 'శ్రీ' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. అంతకు ముందే హిందీ సినిమా చాంద్ సా రోషన్ చెహ్రా లో నటించింది. తమన్నా మొదటి సారి కెమెరా ముందుకు వచ్చిన సమయంలో వయసు కేవలం 13 ఏళ్లు మాత్రమే. చాలా చిన్న వయసులోనే మిల్కీ బ్యూటీ సినీ రంగ ప్రవేశం చేసింది. తాజాగా తమన్నా తన మొదటి హిందీ సినిమా చాంద్ సా రోషన్ గురించి మాట్లాడుతున్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. తాను ఇంకా స్కూల్ లో ఉన్నాను. త్వరలోనే పదో తరగతి పరీక్షలు చేయబోతున్నట్లుగా ఈ వీడియో లో తమన్నా మాట్లాడటం జరిగింది. ఇప్పుడు ఎలా ఉందో తమన్నా తన 13వ ఏట కూడా అలాగే ఉందని ఈ వీడియోకి ఫ్యాన్స్ తెగ కామెంట్స్ చేస్తున్నారు. తమన్నా 13వ ఏట ఉండగా మొదటి సినిమాకు సైన్ చేసింది. అయితే ఆ



సినిమా కాస్త ఆలస్యం అవ్వడంతో 15వ ఏట ప్రేక్షకులకు పరిచయం అయినట్లుగా తెలుస్తోంది. నా వయసు కేవలం పదమూడున్నర ఏళు మాత్రమే అంటూ తమన్నా చేసిన వ్యాఖ్యలు అందనికి ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. ఉత్తరాది ముద్దుగుమ్మలు చిన్న వయసులోనే కాస్త పెద్దగా కనిపిస్తారు అనే అభిప్రాయం ఉంది. తమన్నా యొక్క ఈ వీడియో చూసిన తర్వాత ఆ మాట నిజమే అన్నట్టు అనిపిస్తుంది అంటూ నెటిజన్స్ కూడా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మిల్కీ బ్యూటీ ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపుగా రెండు దశాబ్దాలు అవ్వబోతుంది. ఇప్పటికి కూడా స్టార్స్ కి సూపర్ స్టార్స్ కి జోడీగా సినిమాల్లో నటిస్తూ కెరీర్ పరంగా దూసుకు పోతుంది. ఇటీవల రజినీకాంత్ జైలర్ సినిమా లో తమన్నా కీలక పాత్రలో నటించింది. ఇక మెగాస్టార్ చిరంజీవి సినిమా భోళా శంకర్ లో హీరోయిన్ గా నటించిన విషయం తెల్సిందే. మొత్తానికి తమన్నా బిజీ బిజీగా గా ఇంకా కొనసాగుతూనే ఉంది. చిన్న వయసులో ఎంట్రీ ఇచ్చినా కూడా తమన్నా కి మంచి అవకాశాలు లభించి పదేళ్ల సినీ కెరీర్ ను కొనసాగించింది. తెలుగు తో పాటు తమిళం, హిందీ, కన్నడ భాషల్లో మిల్కీ బ్యూటీ తమన్నా అభిమానులను సొంతం చేసుకునే విధంగా సినిమాలు చేసింది.

## శ్రీలీలను అంతగా భయపెట్టిన విషయం?

టాలీవుడ్ అందాల కథానాయిక శ్రీలీల స్కై ఈజ్ లిమిట్ అన్న చందంగా ఎదుగుతున్న సంగతి తెలిసిందే. వరుసగా క్రేజీ చిత్రాల్లో నటిస్తోంది ఈ బ్యూటీ. తన తదుపరి చిత్రం 'భగవంత్ కేసరి' దసరా సందర్భంగా విడుదల కానుంది. ప్రచార పర్వంలో శ్రీలీల చాలా ఆసక్తికర విషయాలను రివీల్ చేస్తోంది. నిజానికి నందమూరి బాలకృష్ణతో కలిసి నటించడం అంటే ఏ నటికి అయినా అది ఒక సవాల్ లాంటిదే. అందుకే శ్రీలీల చాలా భయపడిందట. తొలి మీటింగ్ లో బాలయ్య గురించి చాలా విన్నాను గనుక భయపడ్డాను. ఆయన చాలా పెద్ద స్టార్ కదా! ఇక తొలి రోజు షూటింగులో ఆయన నాకు పుషప్స్ కోసం ట్రైనింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. అందుకు సంబంధించిన సన్నివేశాన్ని చిత్రీకరించారు. నేను జిమ్ కి వెళ్లే అమ్మాయిని కాను కాబట్టి అలా చేయడం నాకు చాలా కష్టమైంది. బాలకృష్ణ సార్ 'అయ్యా.. సరిగ్గా చేయి' అంటూ టోన్ పెంచారు. నేను ఉద్విగ్నతకు లోనయ్యాను. కానీ ప్రయత్నించాను. నేను సరిగా చేయడంలో ఫెయిలైతే దర్శకుడే నాకు కొన్ని సూచనలు ఇచ్చేవారు.." అని శ్రీలీల చెప్పారు. శ్రీలీల



ఇంకా చాలా సంగతులే చెప్పారు. భగవంత్ కేసరిలో తాను రెగ్యులర్ గా పోషించే తరహా కాకుండా భిన్నమైన పాత్రలో కనిపిస్తానని తెలిపారు.

**శ్రీలీల నెక్ట్స్ ఏంటి? :** నవీన్ పోలిశెట్టి కథానాయకుడిగా నటిస్తున్న 'అనగనగా ఒక రాజు'లో శ్రీలీల నటిస్తుందని కథనాలొచ్చాయి. టీజర్‌తో దీనిని అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో నవీన్ పోలిశెట్టి సరసన ప్రతిభావంతురాలైన శ్రీలీల నటిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలను పెంచుతూ థమన్‌ని సంగీత దర్శకుడిగా తీసుకున్నారు. అయితే ఈ సినిమాకు సంబంధించి ఎలాంటి అప్‌డేట్‌లు ఇటీవల లేకపోవడంపై సందేహాలున్నాయి. ఏడాది క్రితం ప్రకటించినప్పటికీ, ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ఇంకా ప్రారంభం కాలేదు. నిర్మాతలు నిర్దేశించిన అంచనాలను అందుకోవడంలో కథాంశం విఫలమవడంతో, ఆకస్మికంగా సినిమాను వదులుకోవాలనే నిర్ణయం తీసుకున్నట్లు కథనాలొచ్చాయి. కారణం ఏదైనా ఈ పరిణామం శ్రీలీలకి చాలా నిరాశ కలిగించింది. ఎందుకంటే అనగనగా ఒక రాజు తన కెరీర్‌లో గ్రాండ్ అనౌన్స్‌మెంట్ తర్వాత ఆగిపోయిన మొదటి సినిమా కావడమే దీనికి కారణం. ప్రస్తుతానికి సూపర్ స్టార్ మహేష్ – త్రివిక్రమ్ మూవీ గుంటూరు కారం షూటింగును శ్రీలీల పూర్తి చేస్తోంది. గుంటూరు కారంలో శ్రీలీల తో పాటు మీనాక్షి చౌదరి కథానాయికగా ఆడిపాడుతోంది. ఎనర్జిటిక్ డ్యాన్సులు పెర్ఫామెన్సెస్ తో ఆకట్టుకునే శ్రీలీలకు మహేష్ సినిమా పెద్ద అస్సెట్ కానుందని భావిస్తున్నారు.




## దసరా టికెట్ రేట్లు.. లియోకి అంత డిమాండా?



తెలుగు సినీ పరిశ్రమలో పండగ సీజన్ వచ్చిందంటే బాక్సాఫీస్ వద్ద సినిమాల జోరు ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇప్పుడు దసరా పండగ రాబోతుంది. ఈ పండగ బరిలో ఏకంగా ఐదు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద పోటీ పడనుండగా... తెలుగు బాక్సాఫీస్ ముందు మూడింటి మధ్య గట్టి పోటీ నెలకొంది. అవే బాలయ్య భగవంత్ కేసరి, రవితేజ టైగర్ నాగేశ్వరరావు, దళపతి విజయ్ లియో. ఈ మూడు చిత్రాల కోసం అటు అభిమానులు ఇటు సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే తాజాగా వీటి టికెట్ ధరల వివరాలు బయటకు వచ్చాయి. హైదరాబాద్ నగరంలోని మల్టీప్లెక్స్, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఈ చిత్రాల టికెట్లను ఎంతకు విక్రయిస్తున్నారో తెలిసింది. అయితే ఇక్కడ డబ్బింగ్ సినిమా అయిన లియోకు భారీగా రేట్లు ఉండటం గమనార్హం. అవును మీరు చదివింది నిజమే. భగవంత్ కేసరికి మల్టీప్లెక్స్?లో రూ. 250, సింగిల్ స్క్రీన్?లో రూ.175 ఉండగా.. టైగర్ నాగేశ్వరరావుకు మల్టీప్లెక్స్‌లో రూ.200, సింగిల్ స్క్రీన్‌లో రూ.150గా ఉందని సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కానీ లియో మాత్రం ఏకంగా మల్టీప్లెక్స్‌లో రూ. 295, సింగిల్ స్క్రీన్‌లో రూ.175గా చూపించడం ఆసక్తికరంగా ఉంది. ఓ డబ్బింగ్ చిత్రంకు సొంత భాషల చిత్రాల కన్నా ఎక్కువగా విక్రయించడం అంటే ప్రస్తుతం దాని క్రేజ్ ఎలా ఉందో అర్థమవుతోంది. మరి ఈ టికెట్ ధరల్లో మార్పులు, చేర్పులు కూడా ఉండే అవకాశాలు చాలా వరకు ఉండొచ్చు. త్వరలోనే ఈ మూవీ టికెట్‌లు ఆన్ లైన్ లో అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఈ సినిమాల టికెట్ ధరలు ఏ రేంజ్‌లో ఉండబోతున్నాయి మరింత క్లారిటీ వస్తుంది. చూడాలి మరి ఈ సినిమాలు ఎంత వరకు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటాయో.. వీటిలో ఏది పై చేయి సాధిస్తుందో అనేది.

ఇకపోతే భగవంత్ కేసరి మాస్ ఎంటర్‌టైనర్ ఫాదర్ అండ్ డాటర్ నేపథ్యంలో రానుండగా.. టైగర్ నాగేశ్వరరావు ఓ గజదొంగ బయోపిక్?గా వస్తోంది. లియో... గ్యాంగ్ స్టర్ నేపథ్యంలో తెరకెక్కింది.

## మొండిగా రీమేక్ కోసం ముందుకెళితే రిస్క్ తప్పదా?




కొన్ని రీమేక్‌లు చేయాలి..అలా చేయడం చాలా అవసరం కూడా. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో రీమేక్‌లు చేయడం రిస్కే. పాన్ ఇండియా సినిమాల హవా, ఓటీటీల ప్రభావం కారణంగా ప్రతి భాషకు సంబంధించిన సినిమా ఓటీటీల్లో తెలుగు ప్రేక్షకులకు అందుబాటులోకి వచ్చేస్తోంది. దీంతో మునుపటిలా రీమేక్‌లకు అవకాశం లేకుండా పోయింది. ఒక వేళ అలా కాదని రీమేక్‌లు చేసిన వాళ్లు చేతులు కాల్చుకున్న సందర్భాలు ఇటీవల చాలానే చూశాం. పట్టుబట్టి చిరుతో రీమేక్ చేసిన 'గాడ్ ఫాదర్' సోసో అనిపించుకుంది. ఇక మెహర్ రమేష్ దర్శకత్వంలో చేసిన 'భోళా శంకర్' ఇటీవల విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్‌గా నిలిచి షాక్ ఇచ్చింది. ఇక పవర్ స్టార్ పవన్ కల్యాణ్, తన మేనల్లుడు సాయి ధరమ్ తేజ్‌తో కలిసి చేసిన 'బ్రో' కూడా అంతంత మాత్రమే అనిపించింది. దీంతో రీమేక్‌లు చేయాలంటేనే హీరోలే కాకుండా నిర్మాతలు కూడా భయపడుతున్నారు. కానీ కొంత మంది ప్రొడ్యూసర్‌లు మాత్రం రిస్క్ చేయడానికి తొందర పడిపోతున్నారు. రిస్క్ అయినా సరే చేతులు కాల్చుకోవడానికి పోటీపడుతున్నారు. తెలుగులో అది వర్కవుట్ కాదని తెలిసిన తెలిసి తెలిసి చేతులు కాల్చుకోవడానికి రెడీ అయిపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. బాలీవుడ్‌లో అక్షయ్ కుమార్, పంకజ్ త్రిపాఠి ప్రధాన పాత్రల్లో కలిసి నటించిన చిత్రం 'ఓ మై గాడ్ 2'. ఇటీవలే విడుదలైన ఈ సినిమా ఎన్నో అవాంతరాల్ని, వివాదాల్ని అధిగమించి ఫైనల్‌గా ప్రేక్షకుల ముందుకొచ్చింది. సెన్సార్ పరమైన ఇబ్బందులతో పాటు కంటెంట్ పరమంగా విమర్శల్ని ఎదుర్కొని ఫైనల్‌గా హిట్ అనిపించుకుంది. అయితే ఇదే సినిమాని తెలుగులో రీమేక్ చేయాలని కొంత మంది నిర్మాతలు హక్కుల కోసం పోటీపడుతున్నారు. శివుడి పాత్రకు, శృంగార ఆలోచనలతో ఉన్న ఓ యువకుడి చుట్టూ అల్లుకున్న కథ ఇది. ఇలాంటి సున్నితమైన అంశం నేపథ్యంలో సాగే సినిమాని తెలుగులో రీమేక్ చేయడం అంటే కత్తిమీది సాము అనడం కంటే రిస్క్ అనడం కరెక్ట్. తెలుగులో ఇలాంటి కథని ప్రేక్షకులు ఇష్టపడరు. ఆ విషయం తెలిసి కూడా పలువురు నిర్మాతలు రైట్స్‌కోసం పోటీపడటం అర్థం లేని విషయం. గతంలో 'ఓ మై గాడ్' సినిమాని తెలుగులో 'గోపాల గోపాల' పేరుతో పవన్ కల్యాణ్, విక్టరీ వెంకటేష్‌లతో రీమేక్ చేశారు. ఇప్పుడు 'ఓ మై గాడ్ 2'ని అదే ఇద్దరితో రీమేక్ చేయడం కుదరని పని. చేయడానికి వారు ఆసక్తిని చూపించరు కూడా.

కారణం శివుడి పాత్రలో పవన్ నటించడానికి ఆసక్తిని చూపించక పోవచ్చు. ఇటీవల 'బ్రో'లో టైమ్ దేవుడిగా కనిపిస్తే ఆ సినిమా సోసో అనిపించుకుంది. మళ్లీ దేవుడిగా అంటే పవన్ ఆసక్తిని చూపించే ఆవకాశం లేదు. ఇక పంకజ్ త్రిపాఠి పాత్రలో వెంకీ నటిస్తారా? అంటే అదీ కష్టమే. పైగా శృంగార ఆలోచనలతో సాగే కథాంశంని మన వాళ్లు డైజెస్ట్ చేసుకోవడం కూడా కష్టమే. ఇన్ని ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఈ సినిమాని తెలుగులో రీమేక్ చేయాలని ఏ ధైర్యంతో తెలుగు నిర్మాతలు పోటీపడుతున్నారో అర్థం కావడం లేదనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి.

## 'ఉప్పెన' బ్యూటీకి ఇక్కడ నో ఛాన్స్, అక్కడ హోప్స్

చిన్న వయసులోనే సూపర్ హిట్స్ ను, అట్టర్ ఫ్లాప్స్ చవి చూసిన.. చవి చూస్తున్న ముద్దుగుమ్మ కృతి శెట్టి. 18 ఏళ్లు కూడా నిండా లేని వయసు లో ఉప్పెన సినిమా తో భారీ బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న కృతి శెట్టి ఆ తర్వాత వరుసగా మంచి విజయాలను సొంతం చేసుకుని టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ హీరోయిన్స్ జాబితాలో చేరిన విషయం తెల్సిందే. ఏడాది తిరిగే లోపు కృతి శెట్టి కెరీర్ మొత్తం తల కిందులు అయింది. వరుసగా కృతి నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడ్డాయి. దాంతో ఈ అమ్మడికి టాలీవుడ్ లో ఆఫర్లే కరువయ్యాయి. నాగ చైతన్య తో నటించిన కస్టడీ సినిమాపై చాలా హోప్స్ పెట్టుకున్న కృతికి నిరాశే మిగలడంతో ఇక



ఆ తెలుగు సినిమాల్లో ఆఫర్లు దక్కడం లేదు. ఒకటి రెండు చర్చల దశలో ఉన్నాయి కానీ అవి ఎంత వరకు ఫైనల్ అయ్యేది క్లారిటీ లేదు. హీరోయిన్ గా ప్రస్తుతం తమిళంలో ఒక సినిమాను కార్తీ తో కలిసి కృతి శెట్టి నటిస్తోంది. ఆ మధ్య సూర్య తో బాల దర్శకత్వం లో నటించే అవకాశం వచ్చినట్లే వచ్చి చేజారింది. ఆ సినిమా పోయినా కూడా కార్తీ తో నటించే అవకాశం రావడంతో కెరీర్ పై ఈ అమ్మడు హోప్స్ పెట్టుకుంది. తెలుగు లో పట్టించుకోకున్నా కోలీవుడ్ పై నమ్మకం పెట్టుకుంది. కార్తీ హీరోగా సూపర్ హిట్ చిత్రాల దర్శకుడిగా పేరు సొంతం చేసుకున్న నలన్ కుమారస్వామి దర్శకత్వంలో జ్ఞానవేల్ రాజా ఈ సినిమాను స్టూడియో గ్రీన్ బ్యానర్ లో నిర్మిస్తున్నాడు. ఈ సినిమాకు ఉన్న బజ్ నేపథ్యం లో తప్పకుండా మంచి విజయాన్ని సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయి అన్నట్లుగా ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తమిళ్ లో ప్రస్తుతం చేస్తున్న కార్తీ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంటే అక్కడ కృతి శెట్టి బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. అక్కడ వరుసగా సినిమాలు చేయడం ద్వారా మళ్లీ టాలీవుడ్ లో కూడా ఉప్పెన బ్యూటీ రీ ఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉంటాయి. కనుక తెలుగు లో ఛాన్స్ లు లేకున్నా కోలీవుడ్ పైనే కృతి హోప్స్ పెట్టుకుంది.

## జవాని పాప గండే అదిరేలా..

అందాల ఆరబోతతో కుర్రకారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంటుంది బాలీవుడ్ బ్యూటీ అలయ ఎఫ్. హద్దులు పక్కన పెట్టేసి పరువాలన్నీ ప్రదర్శిస్తూ రచ్చ చేస్తుంటుంది. తాజాగా సోషల్ మీడియాలో మరోసారి నేక్డ్ డ్రెస్‌లో గ్లామర్ షో చేస్తూ రకరకాల భంగిమల్లో పోజులు ఇచ్చి సెగలు పుట్టించింది. 2020వ సంవత్సరం లో జవానీ జానేమాన్ చిత్రంతో సినీ రంగంలో అడుగు పెట్టింది అలయ ఎఫ్. ఈమె గురించి సినీ ప్రేక్షకులతో పాటు సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా ఫాలో అయ్యేవారికి దాదాపుగా తెలిసే ఉంటుంది. మొదటి



సినిమాతోనే ఫిల్మ్ ఫేర్ అవార్డు సొంతం చేసుకున్న ఈ బ్యూటీ.. మ్యూజిక్ వీడియోలు, సినిమాల్లో నటిస్తుంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఎల్లె బ్యూటీ అవార్డ్స్‌లో సందడి చేసింది. అక్కడ నేక్డ్ డ్రెస్‌లో కనువిందు చేసి అందరి దృష్టినీ మరోసారి ఆకర్షించింది. కాస్టీ పెరల్స్‌తో చేసిన నెట్ టైప్ డ్రెస్ ధరించి అందాలను ఆరబోస్తూ రకరకాల భంగిమల్లో పోజులిచ్చింది. సైడ్ యాంగిల్, ఫ్రంట్, బ్యాక్, బెండింగ్ పొజిషన్స్‌లో పోజులు ఇచ్చింది. హైహీల్స్ ధరించి, ముత్యాల తో ధరించిన ఇయర్ రింగ్స్‌తో స్టైలిష్ బ్రైడెడ్ హెయిర్ స్టైల్? ఆకట్టుకుంది. బ్యూటీ మొత్తాన్ని కెమెరా ముందు పరిచింది. ఈ ఫొటోలు చూసిన నెటిజన్లు అందం అదిరిపోయిందంటూ హాట్ ఎమోజీలతో కామెంట్లు పెడుతున్నారు. ఇకపోతే ఈమెకు ఇన్ స్టా వేదికగా 1.67 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఈ హాట్ బ్యూటీ ఇప్పటి వరకు 671 పోస్టులను తన అభిమానులతో షేర్ చేసుకుంది. ఈమె అందాన్ని రోజూ చూసేందుకే చాలా మంది ఫాలో అవుతుంటారు. ఈ ముద్దుగుమ్మ పెట్టే ప్రతీ ఫొటోకు షేర్, లైక్, కామెంట్లతో ఎంకరేజ్ చేస్తుంటారు. చివరిసారిగా ఈ ముద్దుగుమ్మ.. ఆల్మోస్ట్ ప్యార్ విత్ డీజే మోహబత్, యూ టర్న్ సినిమాలతో ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం శ్రీ, బడే మియాన్ చోటా మియాన్, ఏక్ ఔర్ గజబ్ కహానీ చిత్రాల్లో నటిస్తోంది. ప్రస్తుతం ఈ చిత్రాలు షూటింగ్ దశలో ఉన్నాయి.

# జనగామను అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం



జనగామలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ అన్నిరంగాల్లో తెలంగాణ అభివృద్ధిలో దూసుకెళ్తోందని తెలిపారు. "జనగామను అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం. జనగామలో మెడికల్ కాలేజీతో పాటు నర్సింగ్, పారామెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తాం. చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తాం. ఎన్నికలు రాగానే ఆగమాగం కావొద్దు. కొన్ని పార్టీలు వచ్చి మాయమాటలు చెబుతాయి. ఎన్నికలు వస్తేనే కనిపించే వాళ్లను ప్రజలు నమ్మొద్దు. మంచి చెడు ఆలోచించి ఓటు వేయాలి." అని కేసీఆర్ ప్రజలకు సూచించారు.

**జనగామ బీఆర్ఎస్ సభలో పొన్నాలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కేసీఆర్** : జనగామలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ ప్రారంభమైంది. ఈ సభలో సీఎం కేసీఆర్, మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి, ఎమ్మెల్సీ, జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, రాజయ్య, పొన్నాల లక్ష్మయ్య పాల్గొన్నారు. కేసీఆర్ వెంట సభకు పొన్నాల లక్ష్మయ్య వచ్చారు. వేదికపై కేసీఆర్ కాళు మొక్కిన గాయకుడు ఏపూరి సోమన్న, వేదికపై పొన్నాల లక్ష్మయ్యకు కండువా కప్పి కేసీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు.




హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా 87 స్థానాల్లో అభ్యర్థులను సిద్ధం చేసినట్లు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడారు. "రాజమహేంద్రవరం జైలులో పార్టీ అధినేత చంద్రబాబును ములాఖత్‌లో కలిసి మాట్లాడా. రాష్ట్ర రాజకీయ పరిస్థితులను ఆయనకు వివరించా. తెలంగాణలో తెదేపా బలంగా ఉంది. శాసనసభ ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేస్తాం. జనసేనతో ముందుకెళ్లాలా? లేదా? అనేది త్వరలోనే తెలుస్తుంది. అభ్యర్థుల పేర్లతో పాటు మేనిఫెస్టో కూడా విడుదల చేస్తాం. 87 స్థానాల్లో అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారు. చంద్రబాబు ఆమోదించాక పేర్లు ప్రకటన ఉంటుంది. తెదేపా తరఫున రాష్ట్రంలో బాలకృష్ణ ప్రచారం చేస్తారు" అని కాసాని జ్ఞానేశ్వర్ వెల్లడించారు.




## భారీగా బంగారం, వెండి ఆభరణాల పట్టివేత

హైదరాబాద్: మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా బంగారం, వెండి ఆభరణాలను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం మియాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అక్రమంగా తరలిస్తున్న 27.540 కిలోల బంగారం, 15.650 కిలోల వెండి వస్తువులు పట్టుకున్నారు. పట్టుబడ్డ బంగారం, వెండి ఆభరణాలకు బిల్లులు చూపక పోవడంతో వాటిని పోలీసులు సీజ్ చేశారు. బంగారం, వెండి ఆభరణాలు తీసుకెళ్తున్న ముగ్గురు వ్యక్తులను మియాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో వాహన తనిఖీలు విస్తృతంగా జరుగుతున్నాయి. సరైన ఆధారాల్లేకుండా తరలిస్తున్న నగదు, బంగారంతోపాటు అక్రమంగా నిల్వ చేసిన, తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు ఎక్కడికక్కడ సీజ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా కారు సీటు కింద దాచిపెట్టి తరలిస్తున్న రూ. 3.04 కోట్లు నగదును నల్లగొండ జిల్లా పోలీసులు సినీఫక్కీలో పట్టుకున్నారు. ఆదివారం ఉదయం ఐదున్నర గంటల ప్రాంతంలో టోల్‌గేట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఓ కారు తప్పించుకుని అతివేగంగా మిర్యాలగూడ వైపు దూసుకెళ్లింది. ఆ కారును అడ్డుకునేందుకు ఈదలగూడ జంక్షన్ వద్ద యత్నించిన మిర్యాలగూడ పోలీసుల విఫలయ్యారు. అయితే, వాడపల్లి అంత రాష్ట్ర సమీకృత చెక్‌పోస్టు దగ్గర పోలీసులు ఆ కారును పట్టుకున్నారు. అందులో తనిఖీ చేయగా కారు ముందుభాగంలోని సీటు కింద గుట్టుగా దాచిన రూ. 3.04కోట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న గుజరాత్‌కు చెందిన విపుల్‌కుమార్, అమర్‌సిన్హాజాను అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం వేర్వేరు చోట్ల మొత్తం రూ. 3,14,58,300 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిర్మల్–జగిత్యాల జిల్లాల సరిహద్దు చెక్‌పోస్టు వద్ద చేపట్టిన తనిఖీల్లో ఓ కారులో గుర్తించిన రూ. 1.44 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే దస్తురాబాద్ మండలం మున్యాల్ గ్రామంలో బెల్టు షాపులపై దాడి చేసి 15.55 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడ వద్ద రెండు కార్లలో 53 తులాల బంగారం పట్టుబడింది. చేవెళ్ల మండలం అంతారం స్టేజీ వద్ద తనిఖీల్లో ఓ కారులో తరలిస్తున్న రూ. 2లక్షలు పట్టుకున్నారు. ఇక, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వాహన తనిఖీల్లో పోలీసులు రూ. 2.01 లక్షలు పట్టుకున్నారు. మంచిర్యాల జిల్లాలో రూ. లక్ష, పెద్దపల్లి జిల్లాలో రూ. 60 వేల నగదు స్వాధీ నం చేసుకున్నారు. ఇక, హైదరాబాద్, రాయదుర్గం పోలీసులు శనివారం రాత్రి చేపట్టిన తనిఖీల్లో భాగంగా రూ. 51లక్షల నగ దు, రూ. లక్ష విలువైన మద్యం సీసాలు సీజ్ చేశారు. నేరేడ్‌మెట్ పోలీసులు శనివారం అర్ధరాత్రి ఓ ద్విచక్రవాహనదారుడి వద్ద రూ. 3,40,000 గుర్తించి సీజ్ చేశారు. కాగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 14వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 15వ తేదీ ఉదయం 6 గంటల వరకు చేపట్టిన తనిఖీల్లో రూ. 39.49 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ తెలిపారు.

## '65 సీట్లను రూ.600 కోట్లకు రేవంత్ అమ్ముకున్నారు'.. టీపీసీసీ కార్యదర్శి ఆరోపణ



హైదరాబాద్: రూ. 10 కోట్లు, 5 ఎకరాల భూమికి గద్వాల టికెట్‌ను పార్టీ చీఫ్ రేవంత్ రెడ్డి అమ్ముకున్నారని టీపీసీసీ కార్యదర్శి కురువ విజయ్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద ఆయన ఆందోళన చేపట్టారు. 'నాడు ఓటుకు నోటు.. నేడు సీటుకు నోటు' అంటూ తన అనుచరులతో కలిసి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ.. "రేవంత్ రెడ్డి 65 సీట్లను రూ. 600 కోట్లకు అమ్ముకున్నారు. తెలంగాణ ఉద్యకారులకు టికెట్లు ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి కాకుండా.. పార్టీలోకి కొత్తగా వచ్చిన వారికే టికెట్లు కేటాయించారు. ఆయన వల్ల పార్టీ తీవ్రంగా నష్టపోతోంది. వెంటనే రేవంత్‌ను టీపీసీసీ అధ్యక్ష పదవి నుంచి తొలగించాలి. ప్రకటించిన తొలి జాబితాను ప్రక్షాళన చేయాలి" అని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు. అలాగే రేవంత్ రెడ్డి అక్రమాలపై ఈడీ, ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## సెలూన్ యజమాని హత్య.. పనివాడే చంపేశాడా?



కూకట్‌పల్లి: హైదరాబాద్ కూకట్‌పల్లి పరిధిలో సెలూన్ నిర్వాహకుడు అశోక్ దారుణ హత్య గురయ్యాడు. అతనిని హత్య చేసింది అదే షాపులో పనిచేసే బిహార్‌కు చెందిన పంకజేనని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. పాపారాయుడు నగర్‌లో గత కొన్నేళ్లుగా 'హర్ష లుక్స్' పేరుతో సెలూన్‌ను అశోక్ నిర్వహిస్తున్నాడు. 4 నెలల కిందట బిహార్‌కు చెందిన పంకజ్‌ను పనిలో చేర్చుకున్నాడు. పంకజ్ తరచుగా వ్యాపారాన్ని మళ్లిస్తూ ఇంటి వద్ద కొనసాగిస్తుండటంతో యజమాని అశోక్ మందలించాడు. దీంతో కోపం పెంచుకున్న పంకజ్ తనతో పాటు ఐదుగురు బిహారి గ్యాంగ్‌తో కలిసి ఆదివారం సాయంత్రం సెలూన్ వద్దకు వచ్చి వెళ్లాడు. అప్పటినుంచి కుటుంబసభ్యులు ఫోన్ చేసినా అశోక్ స్పందించట్లేదు. అయితే, షాప్ వద్దకు వెళ్లి కుమారుడు చూడగా, రక్తపు మడుగులో అశోక్ పడి ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం అందజేయగా.. ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. పంకజ్ తన తోటి వారితో పథకం ప్రకారం అశోక్‌ను హత్య చేసి ఉంటాడని పోలీసులు, కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. దర్యాప్తులో మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.



## బీఆర్ఎస్‌కు పఠాన్‌చెరు నేత మధు రాజీనామా..

సంగారెడ్డి: బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. పఠాన్‌చెరు నియోజకవర్గ అసమ్మతి నేత నీలం మధు ముదిరాజ్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. పార్టీ టికెట్ రాకపోవడంతో తీవ్ర మనస్థాపంతో బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాజీనామా లేఖను పంపించారు. సోమవారం ఉదయం ఆయన స్వగ్రామం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామంలో మధు రాజీనామా ప్రకటన చేశారు. ఈసారి ఎన్నికల బరిలో ఉంటున్నట్లు వెల్లడించారు.

కొత్తపల్లి గ్రామం నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నీలం మధు చివరి క్షణం వరకు బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డారు. సిట్టింగ్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి నిన్న (ఆదివారం) బీఫాం రావడంతో నీలం మధు ముదిరాజ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. 2001లో టీఆర్ఎస్‌లో చేరిన నీలం మధు.. 2014లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో టీఆర్ఎస్ తరపున జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2019లో చిట్కూర్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.

**మీ బిడ్డనై వస్తున్నా.. ఆశీర్వదించండి...** రాజీనామా అనంతరం మధు మీడియాతో మాట్లాడుతూ.. పటాన్‌చెరులో అహంకారం కావాలో.. ఆత్మగౌరవం కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. "ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఎన్నో విధాలుగా ఇబ్బంది పెడుతున్నా.. మీ బిడ్డనై వస్తున్నా. బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నా.

మీ బిడ్డనై వస్తున్న బీసీ బిడ్డను ఆశీర్వదించండి. పటాన్‌చెరు నియోజకవర్గం ఏ ఒక్క కులం దో కాదు. దోచుకొని... దాచుకోవడం మహిపాల్ రెడ్డి తత్వం. కుటుంబ పాలనకు చరమ గీతం పాడాలి. మహిపాల్ రెడ్డి నీ అక్రమాల చిట్టా అంతా నా దగ్గర ఉంది.

ఎమ్మెల్యే నన్ను, నా కార్యకర్తలను తొక్కేయాలని చూస్తున్నారు. రాష్ట్రం మొత్తం పటాన్‌చెరు వైపు చూస్తోంది... నిర్ణయం ప్రజలదే" అని నీలం మధు ముదిరాజ్ పేర్కొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి కన్నుమూత

భద్రాద్రి కొత్తగూడెం : భద్రాచలంకు చెందిన మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి హఠాన్మరణం పాలయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి సత్యవతి విజయం సాధించారు. తీవ్రమైన ఛాతినొప్పితో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కుంజా సత్యవతి మృతి పట్ల బీజేపీ నేతలు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. సత్యవతి మృతిపట్ల కిషన్‌రెడ్డి, ఈటల సంతాపం తెలిపారు. అలాగే.. కాంగ్రెస్ నేతలు రేవంత్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు.

కుంజా సత్యవతి దంపతులు మొదట్లో సీపీఎంలో ఉండేవారు. ఆ తర్వాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చొరవతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో.. 2009 ఎన్నికల్లో భద్రాచలం నుంచి సత్యవతి కాంగ్రెస్ టికెట్‌పై గెలిచారు. ఆ తరువాత ఆమె బీజేపీలో చేరారు. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఆమెకు టికెట్ దక్కే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. ఇంతలోనే సత్యవతి హఠాన్మరణం ఆ పార్టీ నేతలకు షాకింగ్‌గా మారింది.



## ఇలాంటి దిగ్భ్రాంతికరమైన వార్త వినాల్సి వస్తుందనుకోలేదు: కుంజా సత్యవతి మృతిపై కిషన్ రెడ్డి



హైదరాబాద్ : మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకురాలు శ్రీమతి కుంజా సత్యవతి హఠాన్మరణం పట్ల కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ జి. కిషన్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె ఆకస్మిక మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని తెలిపారు. 2009–14లో అసెంబ్లీలో సత్యవతితో కలిసి పనిచేశానన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఎప్పుడూ తపనపడే సత్యవతి.. ఏ చిన్న అవకాశం వచ్చినా ప్రజాసంక్షేమం విషయంలో తన వాణిని బలంగా వినిపించేవారని కిషన్ రెడ్డి అన్నారు. ములుగులో గిరిజన సెంట్రల్ యూనివర్సిటీని మోదీ ప్రకటించిన సందర్భంగా.. వారం రోజుల క్రితం మేడారంలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా వారందరి తరపున మోదీకి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమంలో భాగంగా శ్రీమతి సత్యవతి రాథోడ్ గారితో మాట్లాడానన్నారు. ఎన్నికల కోసం క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనితీరును ఆమె వివరించారని కిషన్ రెడ్డి తెలిపారు. ఇంతలోనే.. ఇలాంటి దిగ్భ్రాంతికరమైన వార్త వినాల్సి వస్తుందనుకోలేదన్నారు. సత్యవతి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ.. వారి కుటుంబసభ్యులకు కిషన్‌రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## బాసరలో జస్టిస్ ఎన్వీ రమణ పూజలు.. మనవరాలికి అక్షరాభ్యాసం

ముథోల్ (బాసర): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని సుప్రీంకోర్టు మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన ఆయనకు ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

అనంతరం సరస్వతి దేవికి కుంకుమార్చన, మహాహారతితోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన మనవరాలు నిత్యశ్రీకి బాసరలో జస్టిస్ ఎన్వీ రమణ అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ ఈవో విజయరామారావు, ఛైర్మన్ శరత్ సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు.



### నన్ను గెలిపిస్తే.. సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని స్వర్గం చేస్తా!: కేఏ పాల్

వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని స్వర్గం చేయడానికి కృషి చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు.

తుకారం గేట్‌లోని మాంగర్ బస్తీలో పాల్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు. ప్రజాశాంతి పార్టీ తరఫున బరిలో ఉండాలని కోరుకుంటున్న వారు పార్టీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.




## ఎస్పీని బదిలీ చేయాలని బీఎస్పీ పట్టు

మంచిర్యాల: ఎస్పీ సురేశ్‌కుమార్‌ను బదిలీ చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పట్టుబట్టడం జిల్లా రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. మూడురోజుల క్రితం ఆర్ఎస్పీ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సురేశ్‌కుమార్ ఎస్పీగా కొనసాగితే జిల్లాలో ఎన్నికలు సజావుగా సాగవని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా పార్టీ ప్రెస్‌మీట్‌లోనూ ఇదే విషయాన్ని చెప్పారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌తో పాటు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు. ఓ మాజీ ఐపీఎస్ అధికారి.. విధుల్లో ఉన్న ఐపీఎస్ అధికారిపై ఇలాంటి ఆరోపణలు చేయడంతో అటు పోలీస్‌శాఖ, రాజకీయ, వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే దీనిపై ఎస్పీ సురేశ్‌కుమార్ స్పందిస్తూ.. సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పను తాను సన్మానించిన ఫొటోలు పాతవని, షెడ్యూల్ విడుదలయ్యాక పక్కాగా ఎన్నికల కోడ్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. నిష్పక్షపాతంగా పని చేస్తున్నట్లు ఎస్పీ సురేశ్‌కుమార్ వివరించారు. అయితే బీఎస్పీ మాత్రం అందుకు సంతృప్తి చెందక ఎస్పీని బదిలీ చేయాలంటూ పట్టుబడుతోంది. దీంతో ఈ వ్యవహారం ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనని అధికారవర్గాలు ఆరా తీస్తున్నాయి.

**ఎన్నికల కమిషన్ ఆరా? :** ఎస్పీని బదిలీ చేయాలని ఫిర్యాదు రావడం, అందులో కొన్ని ఆధారాలు కమిషన్‌కు ఇవ్వడంపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆరా తీస్తోంది. అలాగే రాష్ట్ర పోలీస్‌శాఖ కూడా ఈ వ్యవహారంలో ఇప్పటికే సమాచారం తీసుకుంది. ఈ ఫిర్యాదులో వాస్తవమెంత? అనే కోణంలో ఆధారాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. సిర్పూర్ ఎమ్మెల్యేగా బీఎస్పీ నుంచి పోటీ చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌పై రాజకీయ కోణంతో పాటు ఇతర కోణాల్లోనూ వివరాలు సేకరిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన క్షణం నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులు ఎలక్షన్ కమిషన్ అధీనంలోనే పని చేయాల్సి ఉంటుంది. జిల్లా ఎన్నికల అధికారిగా ఉన్న కలెక్టర్‌తో పాటు ఎస్పీ కూడా కమిషన్ ఆదేశాలు పాటించాల్సిందే.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com